


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

- మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి 3




# ప్రగతి లక్ష్యం.. 2.4 ట్రిలియన్ డాలర్లు



- వికసిత్ భారత్‌కు అనుగుణంగా స్వర్ణాంధ్ర సాధనకు అడుగులు
- టెక్నాలజీ అభివృద్ధికి ఏపీ మార్గం
- డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఆదర్శంగా ఏపీ
- 2047 నాటికి 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- మోదీ అద్భుత నాయకత్వంతో ఆపరేషన్ సిందూర్ విజయం
- నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- ఏపీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి బ్లూప్రింట్ ప్రజంటేషన్...
- ఇతర రాష్ట్రాలకు నమూనా అని ప్రశంసించిన ప్రధాని

2

## విక్షిత్ భారత్ ఆకాంక్షకు ఏపీ దోహదకారి

- సీఎం చంద్రబాబు

2

# ప్రతిష్టాత్మకంగా పసుపు పండుగ

- కడప మహానాడుకు పకడ్బందీగా ఏర్పాట్లు
- నేతలతో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా సమీక్ష
- ప్రాంగణంలో మంత్రుల పరిశీలన
- రికార్డు స్థాయిలో జనం తరలివస్తారని అంచనా
- ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని నేతల దిశానిర్దేశం
- సమష్టి కృషితో దిగ్విజయం చేయాలని పిలుపు

4



## పొగాకు మొత్తం కొంటాం

- మంత్రి అచ్చెన్నాయుడు భరోసా
- బ్లాక్ బర్లీ రైతులు, కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖిలో పాల్గొన్న మంత్రి
- కొనుగోలు ప్రణాళిక ప్రకటన
- కామన్ వెరైటీకి క్వింటా రూ.12 వేలు, లో గ్రేడ్ రకానికి రూ.6 వేల ధర ఖరారు
- ప్రాసెసింగ్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి హామీ
- చర్చల్లో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి, అధికారులు



3

## నెల్లూరు నుంచి మహానాడుకు భారీగా జనం

- ఎక్కడా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- మంత్రులు నారాయణ, అనం 4

## గువ్వలచెరువులో లక్షమందికి పైగా భోజనవసతి

- ఏర్పాట్లు పక్కాగా ఉండాలి 4
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

## మీకు కనీస కృతజ్ఞత లేదు

- ఏడాది కావొస్తున్నా సీఎంను కలిసేందుకు తీరిక దొరకలేదా
- గత ప్రభుత్వం చేసిన అవమానాలను మర్చిపోయారా
- ఇక వ్యక్తిగత చర్చలు ఉండవు, సంబంధిత సంఘాలతోనే మాట్లాడతాం
- సినిమా పరిశ్రమ తీరుపై డిప్యూటీ సీఎం పవన్ ఘాటు లేఖ

5



# ప్రగతి లక్ష్యం.. 2.4 ట్రిలియన్ డాలర్లు

- వికసిత్ భారత్‌కు అనుగుణంగా స్వర్ణాంధ్ర సాధనకు అడుగులు
- టెక్నాలజీ అభివృద్ధికి ఏపీ మార్గం
- డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఆదర్శంగా ఏపీ
- 2047 నాటికి 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- మోదీ అద్భుత నాయకత్వంతో ఆపరేషన్ సిందూర్ విజయం
- నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- ఏపీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి బ్లూప్రింట్ ప్రజంటేషన్...
- ఇతర రాష్ట్రాలకు నమూనా అని ప్రశంసించిన ప్రధాని



ఢిల్లీ (చైతన్య రథం): స్వర్ణాంధ్ర విజన్ -2047లో భాగంగా 2029నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయడమే లక్ష్యంగా ఉన్నామని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పీ-4 ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు బలంగా సంకల్పించామన్నారు. వికసిత్ భారత్-2047 సాకారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుందని పేర్కొన్నారు. ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబు నాయుడు.. వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్రపై నివేదిక ఇచ్చారు. వృద్ధిరేటు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, రెండవ, మూడవ శ్రేణి నగరాల అభివృద్ధివంటి అంశాలపై చర్చించారు.

పహల్గాం ఉగ్ర దాడిని ఖండిస్తూ.. ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసిస్తూ చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే అంశాలను తన ప్రజంటేషన్లో ప్రస్తావించారు. చంద్రబాబు ప్రజంటేషన్‌లోని వివిధ అంశాలు వికసిత్ భారత్‌కు ఉపయోగపడేలా ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ ప్రతిపాదనలను పరిశీలించాలని సూచించారు. చంద్రబాబు ప్రజంటేషన్‌కు సమావేశంలో పెద్దఎత్తున ప్రశంసలు దక్కాయి. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తన ప్రజంటేషన్లో చంద్రబాబు వివరించారు.

2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ఏపీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్టు వెల్లడించారు. వికసిత్ భారత్ కల సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా అడుగులు వేస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులను తాము ఏవిధంగా సద్వినియోగం చేసుకుంటున్నామనే విషయాన్ని తన ప్రజంటేషన్‌లో వివరించారు.

## 3వ స్థానానికి భారత ఆర్థిక వ్యవస్థ

భారతదేశం ఆర్థిక వ్యవస్థ గత పదేళ్లలో 10వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరుకుందని, త్వరలోనే 3వ స్థానానికి వెళ్తుందని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ ఇండియా, జీఎస్టీ, స్టార్టప్ ఇండియా, పీఎం గతిశక్తి, జలజీవన్ మిషన్ వంటి జాతీయ సంస్కరణలు అభివృద్ధికి దోహదం చేశాయని వివరించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్ధిని ఏపీ ప్రభుత్వం డిజిటల్‌గా ట్రాక్ చేస్తోందన్నార. వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా నైపుణ్యాభివృద్ధి, స్వయంఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త వచ్చేలా పాలసీలు తీసుకొచ్చామని, 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు, వన్ డిస్ట్రిక్ట్ వన్ -పార్క్‌ను ప్రవేశపెడుతున్నామని సీఎం వివరించారు.

## టెక్నాలజీ అభివృద్ధికి ఏపీ మార్గం

రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను సీఎం చంద్రబాబు సమావేశంలో లేవనెత్తారు. కర్నూలుజిల్లా ఓర్వకల్లులో డ్రోన్‌సిటీ, అమరావతి రాజధానిలో క్వాంటమ్‌వ్యాలీ,విశాఖపట్నంలో బయో మెడికల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ద్వారా టెక్నాలజీ ఆధారిత అభివృద్ధికి ఏపీ మార్గం వేస్తోందన్నారు.

అంతర్జాతీయస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విశాఖపట్నంను అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ ఏఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్ బుక్ క్రియేట్ చేస్తున్నామని వివరించారు. టాటా ఇన్నొవేషన్ హబ్, ఏఐ ఆధారిత పాలన ద్వారా రాష్ట్రం స్టార్టప్‌లకు, ఉద్యోగ సృష్టికి మార్గదర్శకంగా మారిందని అభిప్రాయపడ్డారు. సర్క్యులర్ ఎకానమీ, అభివృద్ధి వికేంద్రీకరణ, మిషన్ కర్మయోగి వంటి కార్యక్రమాల ద్వారా సమగ్రాభివృద్ధిని ఆంధ్రప్రదేశ్ సాధిస్తోందని సీఎం చంద్రబాబు వివరించారు.

## జీడీపీ, పాపులేషన్ మేనేజ్మెంట్, టెక్నాలజీ చర్చ

రాష్ట్రాభివృద్ధికి ఉపకరించే మూడు కీలక అంశాల గురించి సీఎం చంద్రబాబు సమావేశంలో ప్రస్తావించారు. పెట్టుబడులు, తయారీ, ఎగుమతులు, ఉద్యోగ సృష్టివంటి అంశాలపై దృష్టిపెట్టి, పీపీపీ ప్రాజెక్టులకు కేంద్రం వయబిలిటీ గ్యాఫ్ ఫండింగ్‌కు మద్దతుగా ఉండటం ద్వారా జీడీపీ వృద్ధికి దోహద పడుతుందని అన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాలు జనాభా లేమి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయని, తద్వారా అభివృద్ధిపై ప్రభావంపడే అవకాశం ఉందన్నారు. కానీ భారత దేశానికి ఉన్న జనాభా కలిసొచ్చే అంశమని పేర్కొన్నారు. పాపులేషన్ మేనేజ్మెంట్ ద్వారా దేశంలో వృద్ధుల శాతాన్ని తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. ఈ ఉద్దేశంతోనే స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు, మాతృత్వ సెలవులు పెంపునకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అదేవిధంగా కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, డ్రోన్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగంతో పాలనలో వేగం పెంచడమే కాకుండా, పౌర సేవలను విస్తృతం చేయొచ్చని చంద్రబాబు అన్నారు.

## డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఏపీ ఆదర్శం

స్వర్ణాంధ్ర విజన్-2047 ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో జాతీయాభివృద్ధికి దోహదపడేలా ఆదర్శంగా నిలుస్తుందని సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తి చేసుకునే నాటికి దేశ లక్ష్యాలకు అనుగుణంగా... మార్గదర్శకత్వం వహించేలా ఏపీ ముందుండి నడవడానికి సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు.

## సంక్షోభ సమయంలో ధైర్యంగా నిలిచారు

ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన అమాయకులకు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళి అర్పించారు, సాయుధ బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైందని కొనియాడారు. యుద్ధ వాతావరణం నెలకొన్న సంక్షోభ సమయంలో ప్రధాని మోదీ ధైర్యంగా నాయకత్వం వహించారని సీఎం ప్రశంసించారు.

## సీఎం చంద్రబాబు బ్లూ ప్రింట్‌పై పీఎం ప్రశంసలు

నీతి ఆయోగ్ సమావేశంలో ఏపీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ బ్లూప్రింట్ ద్వారా సీఎం చంద్రబాబు వివరించారు.దీనిపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు.ఇతర రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న సంస్కరణలను అధ్యయనం చేయాలని, సీఎం చంద్రబాబు రూపొందించిన ప్రణాళిక ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు.



# విక్షిత్ భారత్ ఆకాంక్షకు ఏపీ దోహదకారి

- సీఎం చంద్రబాబు నాయుడు

ఢిల్లీ (చైతన్య రథం): వికసిత్ భారత్ ఆకాంక్షకు ఏపీ దోహదకారిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఢిల్లీలో శనివారం ప్రధాని అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ 10వ వార్షిక సమావేశానికి హాజరైన సీఎం చంద్రబాబు.. వికసిత్ భారత్-2047 సాధనకు కీలకాంశాలను ప్రతిపాదించి ప్రధాని మోదీ ప్రశంసలందుకున్నారు. సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. 'ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో న్యూ ఢిల్లీలో జరిగిన 10వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో పాల్గొన్నాను. ఈ సమావేశం 'విక్షిత్ రాజ్యం ఫర్ విక్షిత్ భారత్ -2047' అనే అంశంపైనే కేంద్రీకృతమైంది. ఇది సంపన్నమైన, సమ్మిళితమైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన భారత్‌కు ఒక దార్శనికత. సమావేశంలో-రాష్ట్రాభివృద్ధికి ఉపకరించే మూడు కీలక అంశాలను ప్రతిపాదించాను. పెట్టుబడులు, తయారీ, ఎగుమతులు, ఉద్యోగావకాశాల కల్పనకు లక్ష్యంగా పెట్టుకున్న పీపీపీ ప్రాజెక్టులకు కేంద్ర వయోబిలిటీ గ్యాప్ ఫండింగ్‌కు మద్దతు ఇవ్వమని కోరాను. పెట్టుబడులు, తయారీ, ఎగుమతులు, ఉద్యోగ సృష్టివంటి అంశాలపై దృష్టిపెట్టి, పీపీపీ ప్రాజెక్టులకు కేంద్రం వయబిలిటీ గ్యాఫ్ ఫండింగ్‌కు మద్దతుగా ఉండటం ద్వారా జీడీపీ వృద్ధికి దోహదపడుతుందని ప్రతిపాదించాను. పాపులేషన్ మేనేజ్మెంట్ ద్వారా వృద్ధుల శాతాన్ని తగ్గించుకునే అవకాశం ఉందని పేర్కొంటూ.. స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు, మాతృత్వ సెలవులు పెంపునకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయాన్ని ప్రస్తావించాను. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, డ్రోన్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగంతో పాలనలో వేగం పెంచడమే కాకుండా, పౌర సేవలను విస్తృతం చేస్తున్న అంశాన్నీ ప్రస్తావించాను. 'విక్షిత్ భారత్ -2047' జాతీయ ఆకాంక్షకు గణనీయంగా దోహదపడటానికి ఏపీ కట్టుబడి ఉందని, అధిక నాణ్యత, మౌలిక సదుపాయాలు, సమానాభివృద్ధి, సాధికారత కలిగిన పౌరులతో.. 2047నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సామర్థ్యం కలిగిన రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దే లక్ష్యాలను ప్రస్తావించాను. సాంకేతికత, సంక్షేమం, అట్టడుగుస్థాయి సాధికారతను సమగ్రపరిచే ధైర్యమైన, సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను అందించే స్వర్ణాంధ్ర-2047పై దృష్టిపెట్టిన విషయాన్ని చర్చించాను' అని పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

## మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి



అమరావతి (చైతన్యరథం): కడప జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు దుర్మరణం పాలవడం పట్ల విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాయచోటి నుంచి కడపకు కారులో వస్తుండగా చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో చిన్నారి సహా ముగ్గురు మహిళలు మరణించడం తనను కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం గువ్వల చెరువు ఘాట్ రోడ్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రాయచోటి నుంచి కడపకు వస్తున్న కారును గువ్వలచెరువు ఘాట్ రోడ్డు వద్ద వెనుక వైపు నుంచి లారీ అతివేగంగా ఢీకొంది.ఆవేగానికి కారు ధ్వంసమై అందులో ఉన్ననలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. కారుపై పడ్డ లారీని తీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

### మంత్రి జనార్ధన్‌రెడ్డి విచారం

గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం పై అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర రోడ్లు భవనాలు,పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రాంతాలను.. డేంజర్ స్పాట్‌లుగా గుర్తించి చోదకులను అప్రమత్తం చేసే విధంగా చర్యలుచేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### మార్చురీకి మంత్రి మండిపల్లి

గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో ప్రమాదంలో నలుగురు చనిపోగా వారి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

మంత్రి మండి పల్లి రాంప్రసాద్ కడప రిమ్స్‌కు వెళ్లి మార్చురీ గదిలోని మృతదేహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులతో మంత్రి మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదంలో ఒకేసారి నలుగురు మృతి చెందడం చాలా బాధాకరంగా ఉందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ఎటువంటి అవసరమన్నా తమను సంప్రదించాలని, అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి వారికి భరోసా ఇచ్చారు.

### గువ్వలచెరువు ఘాట్‌రోడ్డు ప్రమాదం విచారకరం : సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): కడప జిల్లా గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులో జరిగిన ప్రమాదం విచారకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కారును లారీ ఢీకొన్న ఘటనలో బద్వేలు మండలం చింతపుత్తాయపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, శిరీష, హర్షిణి, హృతికేష్‌రెడ్డి మృత్యువాత పడటం అత్యంత బాధాకరమన్నారు. ప్రమాదంలో 8, 10 ఏళ్ల చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలిపిన సీఎం... బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఢిల్లీలో ఉన్న సీఎం ప్రమాద ఘటన వివరాలను కార్యాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# పొగాకు పంట చివరి ఆకు వరకూ కొంటాం

- రైతులకు మంత్రి అచ్చెన్నాయుడు భరోసా
- బ్లాక్ బర్లీ రైతులు, కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖిలో పాల్గొన్న మంత్రి
- కొనుగోలు ప్రణాళిక ప్రకటన
- కామన్ వెరైటీకి క్వింటా రూ.12 వేలు, లో గ్రేడ్ రకానికి రూ.6 వేల ధర ఖరారు
- ప్రాసెసింగ్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి హామీ
- చర్చల్లో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి, అధికారులు



పర్చూరు (చైతన్యరథం): పొగాకు రైతులు పండించిన బ్లాక్ బర్లీ పొగాకుని చివరి ఆకు కొనే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. బ్లాక్ బర్లీ పొగాకు రైతులు, బయ్యర్లుగా ఉన్న కంపెనీ ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమం బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. సుదీర్ఘ చర్చ అనంతరం బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుపై రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. బ్లాక్ బర్లీ పొగాకును రెండు గ్రేడ్లతో కొనుగోలు చేస్తామని మంత్రి తెలిపారు. కామన్ వెరైటీ క్వింటా ధర రూ.12 వేలకు, లో గ్రేడ్ రకాన్ని రూ.6,000కు కొనుగోలు చేయాలని ధరలను నిర్ణయించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలలో హెచ్చు, తగ్గులు ఉన్నప్పటికీ నిర్ణయించిన ధరను అమలు చేయాలని కంపెనీలకు సూచించారు. పొగాకు కొనుగోలులో ప్రాసెసింగ్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని హామీఇచ్చారు. అవసర మైతే మార్క్ ఫెడ్ ద్వారా బ్లాక్‌బర్లీ పొగాకు కొనుగోలు ప్రారంభిస్తామని ప్రకటించారు. రైతులు పండించిన పొగాకు పంటను చివరి ఆకు వరకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.ఇందుకోసమే ఆరు సబ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కంపెనీలకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కంపెనీల వద్ద సిబ్బంది లేకపోతే ప్రభుత్వ సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. వేర్ హౌసింగ్ గోడౌన్లను వినియోగించడా నికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సంక్షోభం నుంచి రైతులను బయటకు తెచ్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. కంపెనీలు సాకులు చెప్పడం మాని రైతులకు మేలు చేసే ఉద్దేశంతో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కంపెనీలు స్పందించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారనే విషయాన్ని గుర్తించాలన్నారు. తాము ఫోన్ చేసినా బయ్యర్లుగా ఉన్న కంపెనీలు స్పందించడం లేదని, ఇలా వ్యవహరిస్తే ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. సాధారణంగా 25 మిలియన్ కిలోల పొగా కు సాగు చేయాలని లక్ష్యం కాగా, ప్రస్తుతం 75 మిలి యన్ కిలోల పొగాకు సాగు చేపట్టినట్లు తెలిపారు. ఇదే క్రమంలో అంతర్జాతీయ మార్కెట్లో కొంత డిమాండ్ తగ్గడమే సంక్షోభానికి కారణమని వివరిం చారు. మిర్చి, కొబ్బరి, బ్లాక్ బర్లీ, మామిడి పంటలు సంక్షోభంలోకి కూరుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంక్షోభంలో ఉన్న రైతులకు ధైర్యం కల్పించాలి, వారి కోసం కంపెనీలు బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. రైతు పక్షపాత ప్రభుత్వంగా రైతుల పక్షాన నిలిచామన్నారు. రైతు ఆత్మహత్యల మాట ఈ ప్రభుత్వంలో వినపడరా దన్నారు. ధరల స్థిరీకరణ నిధికి రూ.130 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇటీవల సంక్షోభంలోకి వెళ్లిన టమోటా రైతులను ఆ నిధి నుంచి ఆదుకున్నామన్నారు. రైతులను అన్ని విధాలు గా ఆదుకుంటామని, రైతులు ధైర్యంగా ఉండాలని ఆయన సూచించారు. బ్లాక్ బర్లీ పొగాకు పంటను బయ్యర్లు ఆదివారం నుండే కొనుగోలులు ప్రారంభించాలన్నారు. ఇలాంటి పరిస్థితి రానున్న రోజుల్లో కనిపించరాదని, ప్రత్యామ్నాయ పంటల వైపునకు రైతులు వెళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు చైతన్య పరచాలన్నారు.

### అండగా ఉంటాం: మంత్రి గొట్టిపాటి

పొగాకు రైతులకు ప్రస్తుతం కష్టకాలం నడుస్తోందని, వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. పొగాకు రైతులకు ఇబ్బందులు వచ్చినప్పుడే వారిని ఆదుకోవాలని అన్నారు. కంపెనీల ప్రోత్సాహంతోనే బ్లాక్ బర్లీ పొగాకును రైతులు సాగు చేశారని, చివరి ఆకు వరకు కొనేలా ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. ఆత్మహత్యలు అనే మాట వినపడరాదు, అలాంటి ఆలోచన రైతుల్లోకి రాకూడ దన్నారు. రైతుల పక్షాన ప్రభుత్వం నిలిచిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని, ఈ నేపథ్యంలో కంపెనీలు ముందుకు రావాలని కోరారు. సమస్యల్లో ఉన్న రైతులను ఆదు కోవాల్సిన బాధ్యతను గుర్తించాలన్నారు. వచ్చే ఏడాది పొగాకు పంట సాగు తగ్గించేలా అధికారులు ప్రణాళికలు పొందించు కోవాలన్నారు. రైతులు బాగుంటేనే, కంపెనీలు, కంపెనీలు బాగుంటేనే మీరూ ఇలా ఒకరికొకరు సంయమనంతో ముందుకు సాగాలన్నారు. ప్రాసెసింగ్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుం దని, మంత్రి ప్రకటించడంతో ఐటిసి 10 మిలియన్లకు మించి కొనుగోలు చేయాలని, జీపీఐ కంపెనీ 20 మిలియన్లకు పైగా కొనుగోలు చేయాలన్నారు. అలాగే మిగిలిన కంపెనీలు లక్ష్యాలకు మించి పొగాకు కొను గోలు చేపట్టాలన్నారు. బయ్యర్లు ముందుకు వచ్చి రైతులను ఆదుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన వివరించారు.

### రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే ఏలూరి

సంక్షోభంలో ఉన్న పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. రెండు గ్రేడ్లతోనే పొగాకు కొనుగోలు జరగాలన్నారు. కొనుగోళ్ల పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం చేపట్టే విధి విధానాలను ఆయన వివరించారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా కంపెనీలు ముందుకు రావాలని ఆయన కోరారు.

సంక్షోభంలో ఉన్న రైతులను ప్రభుత్వం కాపాడు తుందని, ఆఖరి కిలో సైతం పొగాకు కంపెనీలు కొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బి.రాజశేఖర్ హామీ ఇచ్చారు. రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయిస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింద న్నారు. రైతుల శ్రమను ప్రభుత్వం గుర్తించిందన్నారు. మంచి ధరలతో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందన్నారు.

పొగాకు రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మంత్రి ప్రకటించిన ధరలతో కంపెనీలు ముందుకు వచ్చి పొగాకు పంటను కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు ప్రక్రియ, ధరల అమలుపై నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ప్రభుత్వం కేటాయించిన మేరకు కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయా లేదా నిరంతరం పరిశీలిస్తామన్నారు.

బ్లాక్ బర్లీ పొగాకు సాగుతో తీవ్రంగా నష్టపోయా మని, కనీస మద్దతు ధర అమలుచేయాలని ఇంకొల్లు, దుద్దుకూరు రైతులు హరిబాబు,వాసుబాబు, కె.వెంకట సుబ్బారావు, సూది సుబ్బారావు, మహిళా రైతు రమాదేవి, జె పంగులూరు మండల రైతులు రావూరి రమేష్ బాబు కోరారు. న్యాయం చేయాలంటూ మంత్రిని అభ్యర్థించారు.

ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, టుబాకో బోర్డుచైర్మన్ యశ్వంత్, ఈడీ విశ్వశ్రీ, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ సురేష్,సంతనూతల పాడు శాసనసభ్యులు బీఎన్ విజయకుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్‌బాబు, మార్క్‌ఫెడ్ అధికారి కరుణ, ఉద్యానశాఖ ఏడీ జెన్నమ్మ, 20కంపెనీల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# ప్రతిష్టాత్మకంగా పసుపు పండుగ

- కడప మహానాడుకు పకడ్బందీగా ఏర్పాట్లు
- నేతలతో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా సమీక్ష
- ప్రాంగణంలో మంత్రుల పరిశీలన
- రికార్డు స్థాయిలో జనం తరలివస్తారని అంచనా
- ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని నేతల దిశానిర్దేశం
- సమష్టి కృషితో దిగ్విజయం చేయాలని పిలుపు





కడప (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ చరిత్రలో తొలిసారిగా కడపలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మహానాడు ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నిరంతరం సమీక్షిస్తున్నారు. కడప సమీపంలోని పబ్బాపురం వద్ద మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించే పార్టీ పండుగ మహానాడుకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 27, 28, 29 తేదీల్లో మహానాడు జరగనుండగా మొదటి రెండు రోజులు.. ప్రతినిధుల సభ, పార్టీ సంస్థాగత నిర్మాణం, పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణ, కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై చర్చ, తీర్మానాల ఆమోదం, తదితర కార్యక్రమాలు ఉంటాయి. మూడో రోజు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారు. మహానాడు ఏర్పాట్లపై ఇటు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా. అటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు పరిశీలన చేస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు ఇస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.

మహానాడు ఏర్పాట్లపై కడప ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో శనివారం ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులతో పల్లా శ్రీనివాసరావు సమావేశమై చర్చించారు. మహానాడు విజయవంతంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులన్నీ సమష్టిగా కృషి చేయాలని పల్లా పిలుపునిచ్చారు. కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపేలా, ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా ఉండాలని సూచించారు. మహానాడును విజయవంతం చేయడానికి అవసరమైన సమగ్ర ప్రణాళికపై చర్చించారు. ప్రతి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యంతో మహానాడును దిగ్విజయం చేయాలని సూచించారు.

మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యేలు అమరనాథ్ రెడ్డి, పులివర్తి నాని, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాం గోపాల్ రెడ్డి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, తదితరులు శనివారం మహానాడు ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఏ విషయంలోనూ ఇబ్బందులు రాకుండా అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

భోజన ఏర్పాట్ల కమిటీ కన్వీనర్, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కమిటీ సభ్యులు కడపలోని మహానాడు ప్రాంగణం వద్ద సమావేశమయ్యారు. మహానాడు చివరి రోజున నిర్వహించే భారీ బహిరంగ సభకు వచ్చే పార్టీ కార్యకర్తలు, నేతలు, సామాన్య ప్రజానీకం కోసం భోజన ఏర్పాట్ల కోసం అనువైన ప్రాంతాలను పరిశీలించారు. కడప, కమలాపురం, మైదుకూరు, పులివెందుల, రాజంపేట వెళ్లే మార్గాల్లో స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రూట్ మ్యాప్, అతిథుల కోసం సిద్ధం చేయాల్సిన మెనూ, మహానాడుకు హాజరయ్యే వేలాదిమందికి ఏటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, నెల్లూరు జిల్లా నుంచి భోజన ఏర్పాట్ల కమిటీ సభ్యుడుగా ఉన్న కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొని కొన్ని సూచనలు అందజేశారు.

# నెల్లూరు నుంచి మహానాడుకు భారీగా జనం

### ఎక్కడా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు - మంత్రులు నారాయణ, అనం



నెల్లూరు (చైతన్యరథం): కడపలో ఈనెల 27 నుంచి జరిగే మహానాడుకు నెల్లూరు జిల్లా నుంచి భారీ స్థాయిలో కార్యకర్తలు తరలి వెళుతున్నారని, అందుకు సంబంధించిన ఏర్పాట్లను పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ వెల్లడించారు. నెల్లూరులో శనివారం మంత్రులిద్దరూ సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. మహానాడుకు జిల్లా నుంచి 50 వేల మంది తరలి వెళతారని అంచనా వేశారు. అందుకు సంబంధించిన రవాణా సౌకర్యాలపై సమీక్షించారు. అవసరమైన మేరకు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలను సైతం అద్దెకు తీసుకోవాలని నిర్ణయించారు. మహానాడుకు వచ్చే నేతలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు నిర్వహిస్తున్నారని.. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి, టీడీపీ నేత బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గువ్వలచెరువులో లక్షమందికి పైగా భోజనవసతి

### - ఏర్పాట్లు పక్కాగా ఉండాలి
### - మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



రామాపురం (చైతన్యరథం): ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో జరిగే మహానాడు సందర్భంగా రాయచోటి ప్రాంతం నుంచి వచ్చే టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాదాపు లక్ష మంది పై చిలుకు ప్రజలకు గువ్వలచెరువు ప్రాంతంలో భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. గువ్వలచెరువు ప్రాంతంలో భోజన వసతులకు సంబంధించి ఏర్పాట్లను శనివారం అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో కలిసి మంత్రి మండిపల్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి మాట్లాడుతూ.... కడపలో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి మదనపల్లి, తంబళ్లపల్లి, పీలేరు, పుంగనూరు, కుప్పం, పలమనేరు, చిత్తూరు, తదితర నియోజకవర్గాల నుంచి లక్ష మంది పైచిలుకు టీడీపీ కుటుంబ సభ్యులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. వీరందరికీ గువ్వలచెరువు ప్రాంతంలో భోజన వసతి ఏర్పాటు చేస్తున్నామని, ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. వాహన పార్కింగ్‌కు సంబంధించి ప్రత్యేక స్థలం కేటాయించాలన్నారు. మొదటిసారిగా కడపలో నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపు ఇచ్చారు.

# అత్యంత వైభవంగా మహానాడు

### - రాష్ట్ర అభివృద్ధిలో కీలకం కానున్న కడప మహానాడు
### - ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర



కడప (చైతన్యరథం): కడపలో ఈ నెల 27, 28, 29న జరగనున్న మహానాడు వేడుక ఏర్పాట్లను మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావుతో కలిసి శనివారం మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అతిపెద్ద పండుగ మహానాడు అన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం ఏర్పడిన పార్టీ మన తెలుగుదేశం పార్టీ. గ్రామ స్థాయి నుండి కమిటీలు ఏర్పాటు చేసుకుని సంస్థాగతం నిర్మాణం కారణంగానే పార్టీ ఇంత పటిష్టంగా ఉంది. తెలుగువారి గౌరవాన్ని కాపాడే లక్ష్యంతో ఎన్టీఆర్ పార్టీని స్థాపిస్తే.. తెలుగువారి సత్తాను ప్రపంచ వ్యాప్తం చేసేందుకు చంద్రబాబు శ్రమిస్తున్నారు. యువనేత లోకేష్ యువగళం పాదయాత్రతో ప్రజల సమస్యలు తెలుసుకున్నాం.. ఆ సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నాం. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి టీడీపీ లక్ష్యం. టీడీపీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా కడపలో మహానాడు నిర్వహిస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధిలో ఈ మహానాడు పాత్ర అత్యంత కీలకం కానుంది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం చూసి వైసీపీ నాయకుల మతి భ్రమించింది. జగన్ రెడ్డి పాలనలో జరిగిన స్కాములు బయటపడుతుండటంలో తప్పుడు కథనాలతో ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ రెడ్డి మద్యం కుంభకోణం మొత్తం బయట పడుతుంది. రాష్ట్రం పచ్చగా ఉంటే చూడలేని దుర్మార్గులు ఈ వైసీపీ నాయకులు. కడప స్టీల్ ప్లాంట్ నాశనం చేసినోళ్లకు కడప అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత ఉందా? రాయలసీమను హార్టికల్చర్ హార్టికల్చర్ హబ్ గా మార్చేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# మీకు కనీస కృతజ్ఞత లేదు

- ఏడాది కావొస్తున్నా సీఎంను కలిసేందుకు తీరిక దొరకలేదా
- గత ప్రభుత్వం చేసిన అవమానాలను మర్చిపోయారా
- ఇక వ్యక్తిగత చర్చలు ఉండవు, సంబంధిత సంఘాలతోనే మాట్లాడతాం
- సినిమా పరిశ్రమ తీరుపై డిప్యూటీ సీఎం పవన్ ఘాటు లేఖ



అమరావతి (చైతన్యరథం): తెలుగు సినీపరిశ్రమలో కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబుని తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారి కూడా మర్యాదపూర్వకంగా కలవలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ డిప్యూటీ సీఎం కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇకపై ప్రభుత్వంతో వ్యక్తిగత చర్చలు ఉండవని, సినిమా సంఘాల ప్రతినిధులే రావాలని స్పష్టం చేసింది.

గత ప్రభుత్వం సినిమా రంగం వారిని, అగ్ర నటులను ఎలా చీత్కరించిందో మరిచిపోయారని, కూటమి ప్రభుత్వం వ్యక్తులను కాదు.. సినిమా రంగం అభివృద్ధినే చూస్తుందని స్పష్టం చేశారు. సినిమా పరిశ్రమ ఇచ్చిన ఈ రిటర్న్ గిఫ్ట్‌ను తగిన విధంగానే స్వీకరిస్తానని పవన్ చురకలు వేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని లేకపోతే, జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లు బంద్ అంటూ ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు హెచ్చరించిన సంగతి తెలిసిందే. తాజాగా ఫిల్మ్ చాంబర్‌లో శనివారం జరిగిన సమావేశం తర్వాత అలాంటిదేమీ లేదని ప్రకటించిన నేపథ్యంలో పవన్ కళ్యాణ్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

### గత ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు మర్చిపోయారా?

ఆంధ్రప్రదేశ్‌లో సినిమా పరిశ్రమను అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా, ఒక్కసారైనా సీఎం చంద్రబాబును కలవలేదు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంలో టిక్కెట్ల రేట్లు పెంచుకునేందుకు వ్యక్తిగతంగా ప్రభుత్వం ముందుకు రావడం మినహా, చిత్ర రంగం అభివృద్ధి కోసం ఒక్కసారి కూడా రాలేదు. అందరూ కలిసి రావాలి అని పిలుపునిచ్చినా సానుకూలంగా స్పందించలేదు. అగ్ర నటులు, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఏ విధంగా చీత్కరించిందో అందరూ మర్చిపోయారు. నాటి ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా అని పవన్ ప్రశ్నించారు.

### ఇక వ్యక్తిగతంగా రావద్దు

ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్, డి. సురేష్ బాబు, వై. సుప్రియ, చినబాబు, సి. అశ్వనీదత్, నవీన్ ఎర్నేని, తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు అని చెప్పాను. అయినా, ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమాలకు టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీశాఖకి అర్జీలు ఇస్తూ వచ్చారు. అయినప్పటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూనే ఉంది. ఇక నుంచి వ్యక్తిగత విజ్ఞాపనలు, చర్చలకు తావులేదు. సంబంధిత విభాగం ప్రతినిధులతోనే చర్చిస్తా. వాటినే సంబంధిత విభాగాలకు పంపిస్తానని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

### థియేటర్లు, మల్టీప్లెక్స్‌లపై ఆరా

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సినిమా థియేటర్ల నిర్వహణ, ప్రేక్షకులకు అందుతున్న సౌకర్యాలు, తదితర అంశాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో సంబంధిత శాఖలతో చర్చించారు. ప్రేక్షకుల నుంచి ప్రభుత్వానికి తరచూ వస్తున్న ఫిర్యాదుల్లో సినిమా హాళ్లలో తినుబండారాలు, పానీయాల ధరలు అత్యధికంగా ఉండటం, మంచి నీళ్ల సదుపాయం కూడా సక్రమంగా లేకపోవడం. వీటిపైనా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయనున్నారు. విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, రాజమహేంద్రవరం, గుంటూరు, కాకినాడ, తిరుపతి తదితర నగరాల్లో ఉన్న మల్టీప్లెక్స్ ల నిర్వహణ వాటిలోని టికెట్ ధరలు, ఆహార పదార్థాల ధరలపై కూడా దృష్టి సారించనున్నారు. సినిమా రూపకల్పన నుంచి వాణిజ్యం వరకూ 24 విభాగాల్లో నైపుణ్యాల పెంపుదల, అధునాతన సాంకేతికత వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ కళ్యాణ్ యోచిస్తున్నారు.

# చరిత మరువదు.. ఎన్టీఆర్ చరిత్ర!

తెలుగుజాతి చరిత్రను తిరగరాసిన ఎన్టీఆర్ చరిత్ర భావితరాలకు మార్గదర్శకం అవుతుంది. ఆయన వ్యక్తి కాదు.. ఒక సంచలనం. సినీ, రాజకీయ విశ్వరూపం. సామాజిక చైతన్యం, పీడిత పాలన వ్యతిరేక దృక్పథం, శ్రామిక జన పక్షపాతం, సమసమాజ నిర్మాణమే ఎన్టీఆర్ ఆశయం. మనం ఎక్కడ పుట్టాం, ఎలా పుట్టామన్నది ముఖ్యంకాదు.. ఆ జాతికి, ఆ ప్రాంతానికి ఏం చేశామనేది ప్రజలు గుర్తుంచుకుంటారు. ప్రజాభిమానమే ఊపిరిగా శ్వాసించి ధ్యాసించి అమరుడైన అన్న ఎన్టీఆర్ 102వ జయంతి ఉత్సవాలను తెలుగువారున్న ప్రతిచోటా జరుపుకుంటున్నారు.

కృష్ణా జిల్లా నిమ్మకూరు గ్రామంలో వెంకట్రావమ్మ, లక్ష్మయ్య చౌదరి దంపతులకు 1923 మే 28న జన్మించారు. రాజకీయాల్లో మహానాయకుడిగా, వెండితెరపై రారాజుగా వెలుగొంది తెలుగుతనానికి ప్రతిరూపంగా నిలిచారు. మహానటుడిగా తెలుగు ప్రజల నీరాజనాలు అందుకున్నారు. సినీనటుడిగా ఎన్టీఆర్ ప్రస్థానం మొదలై ఈ ఏడాదికి 75 వసంతాలు పూర్తయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సినీ వజ్రోత్సవాలను అంగరంగ వైభవంగా ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా సినీవినీలాకాశంలో ధ్రువతారగా వెలుగొందారు. సినీరంగంలో అరుదైన సుందర సాం స్మృతిక స్వప్నాన్ని సాకారం చేశారు. ఒక అద్భుత కళావైభవ ప్రాభవాలను ఆవిష్కరించారు. హీరో అంటే అందరికీ ఎలా ఆదర్శంగా ఉండాలో భవిష్యత్ తరాలకు తెలియ జెప్పిన ఘనత ఆయనకే దక్కుతుంది. అందుకే దశాబ్దాలు గడిచినా ప్రేక్షకుల మనసుల్లో ఆయన రూపు చెరిగిపోలేదు. తెలుగు తెరపై అందాల రాముడైనా, కొంటె కృష్ణుడైన, ఏడుకొండలవాడైనా ఇలా ఏ పాత్రనైనా ఎన్టీఆర్ చేస్తేనే ఆ పాత్రలకు నిండుదనం వస్తుంది. కేవలం పౌరాణిక పాత్రలే కాదు.. సాంఘిక, జానపద, చారిత్రక సినిమాలు ఏవైనా ఆయన నటిస్తే ఆ పాత్రకు పరిపూర్ణత చేకూరుతుంది.

సినిమాలను కేవలం వ్యాపారాత్మకంగా కాకుండా కళాత్మకంగా, సందేశాత్మకంగా, సంఘర్షణాత్మకంగా మలిచారు. ప్రేక్షకులను ఆలోచింపజేసి ఆచరణకు పురిగొల్పేటట్లు ఆయన చిత్రాలు ఉండేవి. అశాంతి, అభద్రత, ఆర్థిక అసమానతలతో జీవించే ప్రజల దుర్భర పరిస్థితులను కళ్లకుకట్టినట్లు చూపించేవారు. దానవీరశూరకర్ణ చిత్రంలో దుర్యోధనుడి పాత్ర ద్వారా ఆయన నోటి నుంచి వెలువడిన మాటల తూటాలు అత్యంత సంచలనం రేపాయి. కుల, వర్గ వ్యవస్థలే ఈ సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతలుగా అభివర్ణించారు. సమాజంలో అంతరాలు సృష్టిస్తూ, అంటరానితనాన్ని ప్రోత్సహించే విధా నాలను నిరసించారు. ఆ చిత్రంలో ఆయన పోషించిన శ్రీకృష్ణ, కర్ణ, దుర్యోధన పాత్రలు అనితరసాధ్యం అని చెప్పాలి. పల్నాటి యుద్ధంలో బ్రహ్మనాయుడు పాత్ర ద్వారా చాప కూడు సిద్ధాంతాన్ని ప్రబోధించారు. మరికొన్ని చిత్రాల్లో కుటుంబ నియంత్రణపై ధ్వజమెత్తారు. జనాభా పెరగడం వల్ల సంపద పెరుగుతుందని ఆనాడే చెప్పారు.

మనదేశం చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. పాతాళభైరవి సినిమాతో ఎన్టీఆర్ పేరు సుస్థిరమైంది. మాయాబజార్‌లో తొలిసారి కృష్ణుడిగా నటించిన ఎన్టీఆర్ ఆ తర్వాత పాత్రలో 30కి పైగా సినిమాల్లో కనిపించి అభిమానులను అలరించారు. అలాగే శ్రీరాము డి పాత్రలో అనేక చిత్రాల్లో కనిపించారు. 1963లో విడుదలైన లవకుశ సినిమా శ్రీరాముడిగా ఎన్టీఆర్‌కు ఎనలేని కీర్తిప్రతిష్టలు సంపాదించి పెట్టింది. సీతారామకళ్యా ణం సినిమాకు తొలిసారి దర్శకత్వం వహించి రావణాసురుడిగా నటించి మెప్పించారు. భీష్ముడు, బృహన్నల లాంటి భిన్నమైన పాత్రలు, రావణుడు, దుర్యోధనుడు లాంటి ప్రతి నాయక పాత్రలను పోషించి మెప్పించారు. తాను ఎంచుకునే కథల్లో రైతులు, సమకాలీన సమస్యలు, వాటి పరిష్కారాలు ఉండేలా చూసుకునేవారు. కర్షకులే కాకుండా కార్మికుల కష్టసుఖాలను ఇతివృత్తాలుగా తీసుకుని నటించారు. ఈ తరహాలో నటించిన నటులు దేశంలో మరొకరు కనిపించరు. కృష్ణుడు, రాముడు ఎలా ఉంటారంటే.. అది వేరే చెప్పా లా.. ఎన్టీఆర్‌లానే ఉంటారని చెప్పుకుంటారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా సినీరంగాన్ని వీడకుండా బ్రహ్మర్షి విశ్వామిత్ర, సామ్రాట్ అశోక్, మేజర్ చంద్రకాంత్, శ్రీనాథ కవిసార్వభౌమ లాంటి చిత్రాల్లో నటించారు. తన సినీ జీవితంలో 13 చారిత్రక, 55 జానపద, 186 సాంఘిక, 44 పౌరాణిక చిత్రాల్లో నటించి తెలుగుతెరపై చెరగని ముద్ర వేశారు.

నాలుగు దశాబ్దాల పాటు తనను ఆరాధించిన ప్రజలకు ఏదైనా చేయాలనే తపనతో రాజకీయ ప్రవేశం చేశారు. సాంప్రదాయ రాజకీయాలను విడనాడి నూతన రాజకీయ వ్యవస్థకు, సంస్కృతికి శ్రీకారం చుట్టారు. సినీరంగంలో ఉన్నప్పుడు కూడా చైనా దురాక్రమణ జరిగిన సమయంలో అమర జవాన్ల కుటుంబాలను ఆదుకోవడం కోసం, దివిసీమ ఉప్పెన సమయంలోనూ జోలెపట్టి ఊరూరా తిరిగి బాధితులను ఆదుకున్నారు. ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశం చేసే నాటికి రాష్ట్రంలో రాజకీయ శూన్యత, అస్థిరత్వం నెలకొ ని ఉన్నాయి. ఉజ్వల చరిత్ర కలిగిన తెలుగుజాతి ఉనికిని కోల్పోయే పరిస్థితులు వచ్చా యి. ఆనాటి కాంగ్రెస్ పెద్దలు తెలుగువాడి ఆత్మగౌరవాన్ని హస్తినాపురంలో అణాపైసలకు అమ్మకానికి పెట్టారు. ఏ క్షణం ఎవరు ముఖ్యమంత్రి అవుతారో, ఎవరు ఎంతకాలం ఉంటారో తెలియదు. ప్రజాభిప్రాయానికి, ప్రజాస్వామ్యానికి తావులేదు. ఆ పరిస్థితుల్లో తెలుగుదేశం ఆవిర్భావం చారిత్రక అవసరంగా ప్రజలు భావించారు.

తన సందేశాత్మక..ఆవేశపూరిత ప్రసంగాలతో ఎన్టీఆర్ ప్రజలకు దగ్గరయ్యారు. ప్రజా వ్యతిరేక విధానాలపై 9 నెలలు అవిశ్రాంతంగా పర్యటించి ప్రజలను తన ఉపన్యాసాల ద్వారా చైతన్యపరిచి భరోసా నింపారు. తెలుగువాడిలో పౌరుషాగ్ని రగిలించి జనాన్ని అదిలించి..కదిలించారు. ప్రజలను తరలించాల్సిన పనిలేదు. స్వచ్ఛందంగా మైళ్లకు మైళ్లు నడుచుకుంటూ పగలు, రాత్రిళ్లు తేడా తెలియకుండా ఎన్టీఆర్‌ను ఒక్కసారైనా చూడాలని, ఆయన ప్రసంగం వినాలని లక్షల సంఖ్యలో హాజరయ్యేవారు. తెలుగుదేశం పిలుస్తోంది.. రా కదలిరా అంటూ పిలుపునిచ్చారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లంటూ నినదించారు. ఎలాంటి రాజకీయ నేపథ్యంలేని అతి సామాన్యులను, యువ త, విద్యావంతులను ఎన్నికల కురుక్షేత్రంలో నిలిపారు. ఆయన చేసిన సాహసోపేతమైన ప్రయోగం రాజకీయ రంగాన్ని ఓ కుదుపు కుదిపింది. 294 స్థానాలు గల శాసనసభలో 202 స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులు విజయం సాధించారు. 1983 జనవరి 9న ఎన్టీఆర్ తొలి కాంగ్రేసేతర ముఖ్యమంత్రిగా గతానికి భిన్నంగా పజల మధ్య ప్రమాణ స్వీకారం చేశారు. నేడు దేశంలో అమలవుతున్న సంక్షేమ పథకాలన్నింటికీ ఆయనే ఆద్యుడు. కిలో రూ.2కే బియ్యం, పేదలకు పక్కాగృహాలు, జనతావస్త్రాలు లాంటి అనేక విప్లవాత్మక నిర్ణయాలు ఆయన తీసుకున్నారు. రూ.50కే హార్స్ పవర్ విద్యుత్, వృద్ధాప్య పెన్షన్ లాంటి అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారు. ఎంతకాలం జీవించామనే దాని కన్నా ఎలా జీవించామన్నదే ముఖ్యం. ప్రతి అడుగు ప్రజల కోసం, ప్రగతి కోసం తపిస్తూ అనేక పాలనా సంస్కరణలు తీసుకువచ్చారు.

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని ఆనాటి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొట్టడంతో దేశవ్యాప్తంగా ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఒక ముఖ్య మంత్రి కోసం యావత్ దేశం స్పందించింది. ఎన్టీఆర్ నెలరోజుల్లోనే తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ క్లిష్ట సమయంలో ఎన్టీఆర్‌కు చంద్రబాబు బాసటగా నిలిచారు. ఇందిరా గాంధీ హత్యతో దేశమంతా సానుభూతి పవనాలు వీచినా 35 పార్లమెంట్ స్థానాలు గెలుచుకుని తెలుగుదేశం ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. జాతీయస్థాయిలో కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారు. దానికి ఆయనే చైర్మన్‌గా వ్యవహ రించారు. కాలక్రమంలో ఎన్టీఆర్ వారసత్వాన్ని జాతీయస్థాయిలో చంద్రబాబు కొనసాగిం చారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవానికి ప్రతీకైతే..చంద్రబాబు ఆత్మవిశ్వాసానికి ప్రతిరూపంగా నిలిచారు. ఇరువురి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని యువనేత నారా లోకేష్ కోటి మంది సభ్యులతో తెలుగుదేశం పార్టీని అద్వితీయ శక్తిగా మలిచారు. ఈ ముగ్గురు కలిసి ఒక ప్రాంతీయ పార్టీకి జాతీయ దృక్పథం తెచ్చారు.

తెలుగుజాతి చరిత్రను సుసంపన్నం చేసి తెలుగు ప్రజలకు గమనాన్ని, గమ్యాన్ని నిర్దేశించారు. చరిత్ర సృష్టించిన శౌర్యధనుడు, చరిత్రనే మార్చిన తెలుగువిభుడు. అందుకే తెలుగుజాతి ఉన్నంత వరకు జన హృదయాల్లో ఎప్పటికీ ఎన్టీఆర్ చిరస్మరణీయులే. ఆయన స్థానం సుస్థిరం, ఆయన కీర్తి అజరామరం. మే 28న ఎన్టీఆర్ జన్మదినాన్ని ఆత్మగౌరవ దినంగా ప్రకటించి ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలను నిర్వ హించడంతో పాటు సెలవు దినంగా ప్రకటించాలి. అంతటి విశిష్ట లక్షణాలు కలిగిన ఎన్టీఆర్‌కు కేంద్రం భారతరత్న ఇచ్చి గౌరవించాలి.

\- మన్నవ సుబ్బారావు

# జర్మనీలో ఘనంగా మహానాడు



జర్మనీలో టీడీపీ మహానాడు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వక్తలు తొలుత ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అభినందన సందేశాలు చదివి వినిపించారు. తీర్మానాల్లో భాగంగా పుల్వామా అమరవీరులకు నివాళులు అర్పించారు. సీఎం చంద్రబాబు పీ 4 కింద ఆంధ్ర రాష్ట్రానికి చేయూత, కూటమి విజయం పై హర్షం, జర్మనీ, చుట్టు పక్కల దేశాల్లో నివసిస్తున్న తెలుగు వారికి ఆపద సమయంలో అందుబాటులో ఉంటామని తీర్మానాలు ప్రవేశ పెట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష మాట్లాడుతూ గత ఎన్నికల్లో అఖండ విజయానికి ప్రవాస భారతీయుల స్ఫూర్తిని అభినందించారు. సుమారు 12 లక్షల మంది ఎన్నికల సమయంలో స్వదేశానికి వచ్చి ఆంధ్ర రాష్ట్రంలో పార్టీకి ప్రచారం చేసి రాష్ట్ర పునర్నిర్మాణానికి కంకణం కట్టుకున్నారని



అభినందనలు తెలియచేశారు. గుంటూరు మిర్చియార్డ్ పూర్వ చైర్మన్ మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ తెలుగుదేశం సిద్ధాంతాలు, ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంస్కరణలు, చంద్రబాబు దూర దృష్టి, లోకేష్ యువ నాయకత్వం గురించి వివరించారు.

పవన్ కుర్రా, శ్రీకాంత్ కుదిటిపూడి, సరేష్ కోనేరు, వంశీ దాసరి, టిట్టు మద్దిపట్ల, సుమంత్ కొర్రపాటి, వెంకట కంద్ర, శివ నిర్వహణలో జర్మనీ మహానాడు జరిగింది. చిన్నారుల సాంప్రదాయ నృత్యాలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో కార్యక్రమం హుషారుగా సాగింది. అతిథులకు సత్కారం తో కార్యక్రమం ముగిసింది.

# విసిరికొట్టినా.. అదే వంచన!

నయ వంచకుడు జగన్‌రెడ్డికి అబద్ధాలు లేకపోతే రాజకీయ బతుకులేదు. అధికారంలోకి వచ్చి ఏడాదికాకముందే -ఐదేళ్ల విధ్వంస రాష్ట్రాన్ని గాడిన పెట్టిన చంద్రబాబు పాలనపై అవాకులు చవాకులు మాట్లాడుతూనే ఉన్నాడు. ఐదేళ్లలో ఆయన చేసిన పాపాల దోపిడీని చంద్రబాబు పాలనకు ఆపాదించే పచ్చి అబద్ధాల ప్రయత్నం నిరంతరం చేస్తూనే ఉన్నాడు. ఎన్నికలకు ముందు జగన్ చెప్పిన పచ్చి అబద్ధాలకు జనం కర్రు కాల్చి వాత పెట్టారు. అయినా ఆయనకు జ్ఞానోదయం కలగడం లేదు.

చంద్రబాబు ఏడాది పాలనలో చేసిన అప్పుల్ని జగన్ ఐదేళ్ల పాలనతో పోల్చి చెప్పడం గురివింద సామెతను గుర్తు చేస్తుంది. అనుభవజ్ఞుడైన చంద్రబాబుతో పోల్చి చెప్పుకునే నైతిక అర్హత జగన్‌కు ఏముందన్నది అసలు ప్రశ్న. ఆర్థిక క్రమశిక్షణలో ఒకప్పుడు దేశానికే ఆదర్శంగా నిలిచిన రాష్ట్రాన్ని ఐదేళ్లలో పాలనలో అప్పుల కుప్పగా మార్చిన ఘనత జగన్‌ది.

ఆంధ్ర ప్రజలపై పది లక్షల కోట్లకు పైగా అప్పుల కుప్పపెట్టిన జగన్.. ఎక్కడ దొరికితే అక్కడ, ఏది కావాలంటే అది తాకట్టుపెట్టి మరీ రాష్ట్ర భవిష్యత్తును అప్పుల అగాధంలోకి నెట్టిన విషయం చరిత్ర ఎప్పటికీ మరువదు. జీఎస్‌డీపీలో 35శాతం అప్పు మించకూడదన్న ఆర్థిక నిబంధనను తుంగలోతొక్కి.. 42శాతం దాటించిన జగన్ పనితనానికి కాగ్ పెట్టిన చివాట్లు అందరికీ తెలుసు. అనధికారిక అప్పులు కూడా కలిపితే రుణాలు 65శాతం దాటిపోయిన దారుణ పరిస్థితులు ప్రజలందరికీ తెలిసిందే. బహిరంగ మార్కెట్ రుణం, కేంద్రంనుంచి వచ్చే రుణాలు, ప్రావిడెంట్ ఫండ్ మొత్తాలు.. ఇలా బయటికి కనిపించేవి కాగా, అసలు ఎవరికీ చెప్పకుండా ప్రభుత్వ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వమే గ్యారంటీలు ఇచ్చి తెచ్చిన రుణాలు మరో ఎత్తు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పులపై నానా యాగీ చేసిన జగన్.. అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుల కోసం ప్రభుత్వ గ్యారంటీల పరిమితిని రెట్టింపు చేశారు. ఏటా ఆర్థిక సంవత్సరంలో సాధించిన పూర్తి రెవెన్యూ రాబడిలో 90శాతం వరకు ప్రభుత్వ గ్యారంటీల మొత్తం ఉండాలనే నిబంధన ఉండేది. దానిని 180 శాతానికి పెంచింది జగన్‌రెడ్డి కాదా? ఏపీని జగన్ మురా దివాలా అంచులకు ఈడ్చి ఆర్థిక క్రమశిక్షణకు సమాధి కట్టలేదా? ఆ దరిద్రాన్ని ఉద్దేశపూర్వంగా విస్మరించి.. బాబు ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేయడం జగన్‌కే సాధ్యం!

చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదన్నది జగన్ చేస్తోన్న దుష్ప్రచారం. నవరత్నాలతో నిలువునా



ముంచిన భ్రష్ట చరిత్ర జగన్‌దే. చంద్రబాబు మునుపటి ప్రభుత్వంలో తెచ్చిన పథకాలకు పాతరేసి.. అవే వైసీపీ నవరత్నాలుగా వదిలిన దుర్మార్గుడు జగన్. రైతు కుటుంబాలకు పెట్టుబడి సాయంగా ఏటా రూ.12,500 ఇస్తానన్న జగన్ -పీఎం కిసాన్ యోజన మొత్తం రూ.6000 అందులో కలిపేసి వంచనకు పాల్పడింది నిజంకాదా? పగటిపూటే తొమ్మిది గంటల ఉచిత కరెంటు, రూ.3000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, రూ.4000కోట్లతో విపత్తుల సహాయక నిధి అంటూ బూటకపు వాగ్దానాలతో మోసాలకు పాల్పడలేదా? ఇచ్చిన వాగ్దానాల మేరకు -శీతల గిడ్డంగులు లేవు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కనిపించలేదు. భవిష్యత్తుపై రైతుకు భరోసా లేకుండా చేసిన జగన్ -చివరకు ఆరోగ్యశ్రీని అస్వస్థతకు గురిచేసి అనారోగ్య పీడితుల్ని వంచించాడు. చికిత్స వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచామని గొప్పలు చెప్పుకుని.. ఆస్పత్రులకు బిల్లులు బకాయిపెట్టి ఆరోగ్యశ్రీని ముంచేశాడు. 'విద్యాదీవెన' అంటూ ఆర్భాటం చేసి పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడింది జగన్ సర్కారు. చేయూత ఇస్తానని చెప్పి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళలకు మోచెయ్యి చూపించాడు.

చదువుతోనే సామాజిక హోదా, ఆర్థిక ప్రగతి అంటూ అల్లిబిల్లి కబుర్లు చెప్పి విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టాడు. పేద కుటుంబాలు నెత్తిన రూ.3000 కోట్లు భారం మోపాడు. మద్యపాన నియంత్రణ సాకుతో లిక్కరు ధరలకు రెక్కలు తొడిగి, అడ్డమైన బ్రాండ్లనూ జనం మీదకు వదిలిన జగన్.. వేలాది ప్రాణాలకు మరణ శాసనం రాసిందీ జగనే. నాసిరకం మద్యం నిరుపేదల్ని బలిగొంటుంటే, ఆ శవాలమీద కాసుల పేలాలు ఏరుకున్నదీ జగనే. విషపూరితమైన జె బ్రాండ్ మద్యంతో ప్రజారోగ్యాన్ని పొట్టన పెట్టుకున్నాడు. ఏపీని గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా మార్చేశాడు. జగనన్న కాలనీలనూ నీరుగార్చేసి.. పేదల సొంతింటి కల్ని నిలువునా తుంచేశాడు. దాదాపు రూ.51,000 కోట్లతో 17వేల జగనన్న కాలనీల్లో 28,38,227 గృహాల్ని రెండు దశల్లో నిర్మిస్తామంటూ చేసిన ఆర్భాటం.. క్షేత్రస్థాయిలో అడ్రెస్ లేకుండా పోయింది. తెదేపా హయాములో దాదాపు పూర్తైన టిడ్కో ఇళ్లనూ పాడుపెట్టి బూత్ బంగ్లాలుగా మార్చేసిన నీచ చరిత్ర జగన్‌రెడ్డిది. పనికి మాలిన పథకాలను నవరత్నాలుగా బులిపించి, జనాన్ని పిచ్చోళ్లలా జమకట్టి లబ్దిదారులంతా మళ్లీ తనకే ఓటెయ్యాలన్న డ్రామాల జగన్ కపటాన్ని ప్రజలు గుర్తించారు కనుకే.. పాతాళంలోకి తొక్కేశారు. అలాంటి నువ్వా జగన్‌రెడ్డీ.. చంద్రబాబు సంక్షేమ పాలనపై వ్యాఖ్యలు చేసేది?

మంచి పరిపాలన అందిస్తానంటూ ఊరూవాడా ఊదరగొట్టి 2019 ఎన్నికల్లో గెలిచిన జగన్- రోడ్డు వేయలేదు. పరిశ్రమలను తీసుకురాలేదు. యువతకు ఉపాధి చూపించలేదు.

రైతులకు సాగునీరు ఇవ్వలేదు. దళితులూ గిరిజనులకు కనీస భద్రత కల్పించలేదు. ఏపీని అన్నిరంగాల్లో కటిక చీకట్లలోకి నెట్టిన చరిత్ర జగన్‌దే. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని హతమార్చిన జగన్ పార్టీని ఏపీ ప్రజలు అథఃపాతాళానికి తొక్కేశారు! రాక్షసత్వంలో జగన్‌రెడ్డికి సరిజోడులై, తోడుదొంగలై ఏపీని పీల్చి పిప్పిచేసిన వైకాపాసురులపై ఆంధ్ర ప్రజానీకం కసితీరా వేటేసింది.


మా వెంట్రుక కూడా పీకలేరని విర్రవీగిన జగన్‌పై ఆగ్రహంతో రగిలి పోయిన ప్రజలు, జగన్ నెత్తిమీద పదకొండు వెంట్రుకలనే ఉంచి మిగతావి పీకి కుప్పలు పెట్టారు. తానేదో రాష్ట్రం కోసం జీవితాన్ని ధారపోసినట్లు నక్క వినయాలు ప్రదర్శిస్తే.. మళ్లీ ప్రజలు నమ్ముతారని అనుకోవడం అతని భ్రమ. జనాన్ని పీడించి జనం చేతిలో చావుదెబ్బ తిన్న తరువాత కూడా జగన్‌లో మార్పు రావడం లేదు. ప్రతిపక్ష హోదా కూడా దక్కనంతగా ప్రజలు తిరస్కరించినా తన బుద్ధి మార్చుకోవడం లేదు. రాజకీయ ప్రయోజనాల కోసం మీడియా వ్యవస్థను ఏర్పాటుచేసి.. ఇతర గిట్టని మీడియా వ్యవస్థలమీద విషం కక్కడానికి ఇంగితం ఉండాలి. చేతిలో రోత పేపర్ ఉందని ఏదిబడితే అది తెలుగుదేశానికి ఆపాదించి విషం గక్కినంత మాత్రాన -ప్రజలు నమ్ముతారని అనుకోవడం కల్ల. పత్రికా విలువలకు తిలోదకాలిచ్చి అవినీతి పుత్రిక సాక్షిలో అరాచక రాతలు రాయడానికి సిగ్గు లేదూ. దీనికి మీరు ఏం సమాధానమిస్తారు జగన్ రెడ్డి!

-నీరుకొండ ప్రసాద్

## యోగా డే విజయవంతానికి

# పారిశ్రామికవేత్తలు సహకరించాలి

### - మంత్రులు డోలా, అనిత పిలుపు






విశాఖపట్టణం (చైతన్యరథం): విశాఖ వేదికగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల విజయవంతానికి జిల్లాలోని పారిశ్రామికవేత్తల సహకారం చాలా అవసరమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కలెక్టరేట్లో శనివారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశం అనంతరం ఉమ్మడి జిల్లాలోని పారిశ్రామికవేత్తలతో మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ కలిసి వీసీ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్యక్రమ నిర్వహణలో పారిశ్రామికవేత్తల పాత్ర, తీసుకోవాల్సిన చర్యలు, అందించాల్సిన సహకారం గురించి ముందుగా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ వివరించారు. ఆయా కంపెనీల పరిధిలో పని చేసే ఉద్యోగులకు, కార్మికులకు నెల రోజుల పాటు యోగా శిక్షణ అందించాలని, జూన్ 21వ తేదీన జరిగే ప్రధాన కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు రోజుల్లోగా ఉద్యోగుల వివరాలతో కూడిన నివేదికలు అందజేయాలని చెప్పారు.

మంత్రులు మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణలో పారిశ్రామిక వేత్తలు కీలక పాత్ర వహించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ మహత్తర క్రతువులో భాగస్వామ్యం కావటం ద్వారా ఒక వైపు కార్యక్రమ విజయవంతానికి కృషి చేయొచ్చని, మరొక వైపు ఉద్యోగుల, కార్మికుల ఆరోగ్యానికి కూడా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ సొంత కార్యక్రమంగా, బాధ్యతగా భావించి స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు, కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని, వారందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని, ఉచితంగా మ్యాట్లు, టీషర్టులు కూడా అందజేస్తామని పారిశ్రామికవేత్తులు అడిగిన ప్రశ్నకు బదులుగా చెప్పారు. ఇదొక గౌరవంగా భావించి పారిశ్రామిక వేత్తలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ విప్‌లు వేపాడ చిరంజీవి రావు, గణబాబు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్.టి.ఆర్. వైద్య సేవా ట్రస్టు ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఏపీ గ్రోవర్స్ ఆయిల్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, డీసీపీ అజిత, తదితరులు పాల్గొన్నారు.

**యోగాంధ్రలో పాల్గొన్న మంత్రులు**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నాహకంలో భాగంగా విశాఖలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్రలో మంత్రులు డీబీవీ స్వామి, అనిత పాల్గొన్నారు. విశాఖ బీచ్ రోడ్‌లో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ విశాఖలో జరిగే యోగా దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 11వ యోగా దినోత్సవం విశాఖలో నిర్వహించనుండటం అదృష్టం. రోజూ గంట ఆసనాలు వేస్తే రోజంతా ఉత్సాహంగా ఉంటాం. వచ్చే నెల 21న విశాఖలో జరిగే యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతారన్నారు. ఆరోగ్యమే మనకు గొప్ప ఆస్తి  అన్నారు. అందరిలో ఆరోగ్య భద్రత పెరిగిందని, ప్రస్తుతం పాత తరం ఆహారపు అలవాట్ల వైపు అడుగులు వేస్తున్నామని చెప్పారు.

# ఎస్బీఐ ఉద్యోగి మోసం చేశారు

- **నా కొడుకుని అమెరికాకు పంపిస్తానని రూ. 19 లక్షలు కొట్టేశారు**
- **గ్రీవెన్స్‌లో బాధిత మహిళ ఆవేదన**
- **మోసాలతో పాటు వివిధ సమస్యలపై వెల్లువెత్తిన వినతులు**
- **అర్జీలు స్వీకరించిన గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు**



అమరావతి (చైతన్యరథం): వివిధ సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు ప్రజలు శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి తరలివచ్చారు. బాధితుల నుండి గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం తాడేపల్లికి చెందిన షేక్ రజియా అర్జీ ఇస్తూ.. రాజమండ్రిలో తాము నివాసం ఉంటుండగా తమ కొడుకుని అమెరికాకు పంపిస్తామని చెప్పి అందుకు 25 లక్షలు ఖర్చు అవుతుందని నమ్మించి ముగ్గురు వ్యక్తులు తమ వద్ద రూ. 19 లక్షలను కొట్టేశారని ఫిర్యాదు చేశారు. ఇందుకు బాధ్యులైన వారిని విచారించి తమ డబ్బులు తమకు ఇప్పించాలని కోరారు. వీరిలో ఒకరు ఎస్బీఐలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడని ఇలాంటి మోసగాళ్లను ఉద్యోగం నుండి కూడా తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం కొండామర్రిపల్లి గ్రామానికి చెందిన జి. బాలాజీ విజ్ఞప్తి చేస్తూ.. తాను లేని సమయంలో కొందరు వ్యక్తులు జేసీబీ తీసుకొచ్చి తన ఇంటికి వేసుకున్న కంచెను, తమ స్థలంలోని ఔషద మొక్కలను ధ్వంసం చేశారని.. ఈ దుర్మార్గానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం జరిగేలా చూడాలని అభ్యర్థించారు.

పల్నాడు జిల్లా గురజాల మండలం చర్లగుడిపాడు గ్రామానికి చెందిన పట్టెల అలేఖ విజ్ఞప్తి చేస్తూ...  గుంటూరులో పిరమెల్ కాస్టల్ అండ్ హౌసింగ్ ఫైనాన్సియల్ లిమిటెడ్ వారు నిర్వహించిన వేలంలో తాను బిడ్డర్‌గా వేలంపాడి దక్కించుకొని రిజిస్టర్ చేసుకున్న ఇంటిని తమదంటూ ఒక వ్యక్తి, అతని భార్య తమపై దౌర్జన్యానికి వస్తున్నారని ఫిర్యాదు చేశారు. అతను వెస్ట్‌జోన్ ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడని.. అతనిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.


తమ థియేటర్ కొనుగోలు చేస్తామని చెప్పి తమ దగ్గర ఉన్న ఒరిజినల్ డాక్యుమెంట్స్ తీసుకొని చింపేసి తమను బంధించి కొట్టి హాలును స్వాధీనం చేసున్న వారిపై పోలీసు కేసు పెట్టి సంవత్సరం దాటినా ఇంతవరకు ఛార్జ్‌షీట్ ఫైలు చేయలేదని, తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాపట్ల జిల్లా పర్చూరుకు చెందిన కొత్తూరి రాజరాజేశ్వరి విజ్ఞప్తి చేశారు.

ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామానికి చెందిన గుమ్మా గంగరాజు విజ్ఞప్తి చేస్తూ..  లంచం ఇవ్వలేదని తమ భూమిని 43 రిజిస్టర్‌లో అక్రమంగా  నమోదు చేసి ఎన్ఓసీ రాకుండా చేసిన ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పై చర్యలు తీసుకోవాలని, తమ దగ్గర ఉన్న ఆధారాలను పరిశీలించి భూమికి ఎన్ఓసీ ఇప్పించాలని అభ్యర్థించారు.

తన మామ, ఆడపడుచులు తన భర్తను తన నుండి దూరం చేయడమే కాకుండా, తన భర్త తాను కొనుగోలు చేసిన ఇంటిని మరొకరికి అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని గుంటూరుకు చెందిన షేక్ మల్లిక గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తనను తన పిల్లల్ని చంపేందుకు చూస్తున్నారని, వారి వల్ల తమకు ప్రాణహాని ఉందని, తనకు సాయం చేయాలని అభ్యర్థించారు.





# కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు

- త్వరలోనే మిగిలిన నామినేటెడ్ పదవుల భర్తీ
- రాయలసీమ అభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయం
- కడప మహానాడు విజయవంతం చేద్దాం
- శ్రీసత్యసాయి జిల్లా మహానాడులో మంత్రి సవిత



పుట్టపర్తి (చైతన్యరథం): టీడీపీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామని, త్వరలోనే మిగిలిన నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖల మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై గత ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసుల మాఫీపైనా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో శనివారం నిర్వహించిన జిల్లా మహానాడు సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. పేదలకు, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన ఘనత దివంగత ఎన్టీఆర్‌దేనన్నారు. నేడు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో టీడీపీ మరింత బలోపేతమైందన్నారు. దేశంలో ఏ పార్టీకీ లేని కార్యకర్తల బలం టీడీపీకి మాత్రమే సొంతమన్నారు. కన్నబిడ్డల మాదిరిగా కార్యకర్తలను సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కాపాడుకుంటున్నారన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా అందిస్తున్నామన్నారు. పేద కార్యకర్తల పిల్లల చదువులకు పార్టీ అధిష్టానం అండగా నిలుస్తోందన్నారు.

**రాయలసీమలో ప్రతి ఎకరాకూ నీరందిస్తాం**

సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ జోరుగా సాగుతోందని మంత్రి సవిత తెలిపారు. ఇప్పటికే అమరావతి, పోలవరం ప్రాజెక్టు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, రాయలసీమలో ప్రాజెక్టులన్నీ నీటితో నింపుకోవొచ్చునన్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు కూడా పూర్తయితే రాయలసీమలో ప్రతి ఎకరాకూ నీరందిస్తామన్నారు. గత ప్రభుత్వ అసమర్థత కారణంగా రాయలసీమ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. సీఎం చంద్రబాబు రాకతో, రాయలసీమలో పలు పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు. రాయలసీమను పారిశ్రామిక హబ్‌గా, హార్టీకల్చర్ హబ్ గా అభివృద్ధి చేయానికి సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు.

**త్వరలోనే మిగిలిన నామినేటెడ్ పదవుల భర్తీ**

గడిచిన ఎన్నికల్లో కూటమి విజయంలో కార్యకర్తల కృషి మరువలేనిదని మంత్రి సవిత కొనియాడారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామన్నారు. త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని, ఇప్పటికే ఈ దిశగా మంత్రి నారా లోకేష్ చర్యలు ప్రారంభించారని వెల్లడించారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులపైనా బనాయించిన అక్రమ కేసుల మాఫీపైనా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యకర్తల పార్టీ టీడీపీ అని అన్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించనున్న మహానాడు విజయవంతానికి జిల్లా టీడీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారధి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరరెడ్డి, ఎమ్మెస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రులు ఎన్. కిష్టప్ప, పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, నాయకులు పరిటాల శ్రీరామ్, జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంతకుముందు జిల్లా మహానాడు ప్రారంభం సందర్భంగా అన్న ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి సవిత సహా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళు లర్పించారు. టీడీపీ జెండాను మంత్రి సవిత ఆవిష్కరించారు.




# మహానాడుకు భారీగా తరలి కావాలి

**- రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా రాయచోటి అభివృద్ధి**

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

గాలివీడు (చైతన్యరథం): కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి రాయచోటి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపు ఇచ్చారు. శనివారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గాలివీడు మండలం, శ్రీనాథ్ కళ్యాణ మండపంలో మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... ఈనెల 27, 28, 29 తేదీలలో కడప నగరం సమీపంలోని చింతకొమ్మదిన్నె మండలం, పబ్బాపురంలో అత్యంత ఘనంగా మహానాడు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

రాష్ట్రం నలుమూలల నుంచి లక్షల మంది టీడీపీ కుటుంబ సభ్యులు మహానాడు కార్యక్రమానికి హాజరవుతారన్నారు. రాయచోటి మీదుగా మహానాడు కార్యక్రమానికి వెళ్లే ప్రతి ఒక్కరికి రామాపురం సమీపంలో భోజన వసతి ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ పేదల మేలు కోసమే పనిచేస్తుందన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందన్నారు. గతంలో ఎంతో వెనుకబడి ఉన్న రాయచోటి నియోజకవర్గం కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటి గా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోనే ఆదర్శ నియోజరవర్గంగా రాయచోటిని అభివృద్ధి చేస్తామని మంత్రి మండిపల్లి పేర్కొన్నారు.

# సినీ రంగానికి పూర్తి సహకారం

- ఫిల్మ్ ఇండస్ట్రీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- జూన్ 1 నుండి థియేటర్లు మూసివేస్తారన్న ప్రచారంపై విచారణ
- సినీ పరిశ్రమ అభివృద్ధి కోసమే నూతన ఫిల్మ్ పాలసీ
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టీకరణ



రాజమహేంద్రవరం (చైతన్యరథం): చిత్ర పరిశ్రమకు, ఎగ్జిబిటర్లకు, డిస్ట్రిబ్యూటర్లకు, నిర్మాతలకు అందరికీ ప్రయోజనం కలిగించేలా నిర్ణయాలు తీసుకునేందుకే హెూంశాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో విచారణ చేపడుతున్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం రాజమహేంద్రవరంలోని హుకుంపేటలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించారు. సినీ పరిశ్రమకు పూర్తి సహకారం అందించే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. జూన్ 1వ తేదీ నుండి సినిమా థియేటర్ల బంద్ చేయబోతున్నారన్న విషయం కొన్ని రోజులుగా ప్రచారంలోకి వచ్చిందని, ఈ క్రమంలో ఈ అంశం ఇప్పుడు ఎందుకు తెరపైకి వచ్చిందని, దీనికి ప్రోద్బలం అందిస్తున్న వ్యక్తులెవరు, అసలు జరుగుతున్నదేమిటి, తదితర అంశాలన్నింటిపై విచారణ జరిగితే చిత్ర పరిశ్రమకు ఉపయోగపడే విధానాలను అవలంబించేందుకు వీలుగా ఉంటుందన్న ఉద్దేశంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ విషయం తెలియగానే హెూం శాఖ సెక్రటరీ కుమార్ విశ్వజిత్‌తో చర్చించానన్నారు. ఈ అంశంపై లోతుగా విచారణ చేయాలని ఆదేశించానన్నారు. తద్వారా అసలు విషయం వెలుగులోకి వస్తుందని, అనంతరం తమ చర్యలుంటాయన్నారు.

**సినీ పరిశ్రమకు అండగా..**

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అన్ని అంశాలను పరిశీలించి, లోతుగా అధ్యయనం చేసి సినీ పరిశ్రమకు సహకారం అందించాలని నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సినీ పరిశ్రమకు చెందిన వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను ఆరా తీసి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసానిచ్చిన విషయం గుర్తుచేశారు. గతంలో మాదిరి కాకుండా సినీ పరిశ్రమను తాము గౌరవిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారని మంత్రి అన్నారు. సినీ పరిశ్రమకు చెందిన ఏ సమస్య అయినా సినిమాటోగ్రఫీ మంత్రిగా తనతో మాట్లాడాలని సినీ పెద్దలకు డిప్యూటీ సీఎం నాడు సూచించినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇప్పటివరకు సినీ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ ఆకస్మాత్తుగా థియేటర్ల బంద్ అనే అంశం తెరపైకి ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. దీని వెనుక ఉన్న కారణాలను ఆరా తీస్తున్నామన్నారు. జూన్ 12వ తేదీన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నటించిన హరిహరవీరమల్లు చిత్రం విడుదలవుతున్న సందర్భంలో ఈ రకమైన వాతావరణం ఎందుకు వచ్చిందో తెలియడం లేదన్నారు. ఇది ఎంత మాత్రం సరికాదన్నారు. థియేటర్ల మూసివేత అనే అంశంలో ఎవరితోనైనా చర్చించి నిర్ణయం తీసుకున్నారా అని ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఆకస్మాత్తుగా థియేటర్లను మూసివేస్తామని నిర్ణయం తీసుకోవడానికి దారితీసిన కారణాలేంటని ప్రశ్నించారు. ఈ అంశాలన్నీ తెలుసుకునేందుకే పూర్తిస్థాయి విచారణ చేయిస్తున్నామని, తద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టతనిచ్చారు.

**నూతన విధానం..**

అంతేగాక సినిమాలకు సంబంధించి టికెట్ల రేట్ల పెంపు విషయంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే ఏ నిర్మాత ఇబ్బంది పడకుండా తాము వెంటనే ఆమోదించి ఆయా స్థాయిల్లో టికెట్ల రేట్లు పెంచుతున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. సినిమా నిర్మాణం సమయంలో అనుమతులు త్వరితగతిన జారీ చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు సినీ నిర్మాతలతో మాట్లాడుతూనే ఉన్నామన్నారు. సినీ పరిశ్రమను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసానిచ్చారు. కలిసి ముందుకు వెళ్లడం కోసమే నూతన ఫిల్మ్ పాలసీ తెస్తున్నామన్నారు. ప్రతిసారి దరఖాస్తు చేసుకునే పరిస్థితికి చెక్ పెడుతూ ఒక పాలసీ రూపకల్పన జరుగుతుందన్నారు. ప్రతి సినిమాకు విడివిడిగా అనుమతులు అడిగే పరిస్థితి రాకూడదని పలు నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. చిత్రపరిశ్రమకు మేలు చేసేందుకు తామున్నామని వివరించారు. ఈ క్రమంలో థియేటర్లు మూసివేసే పరిస్థితి ఎందుకు వస్తుందన్నారు. విచారణ అనంతరం బయటికి వచ్చే అంశాలను ప్రాతిపదికన తీసుకొని నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

# హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యం

- ప్రధాని మోదీ యోగా కార్యక్రమంతో విశాఖ ప్రపంచ రికార్డులకు ఎక్కనుంది
- పీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి, ఎక్కడా చిన్న లోపం కూడా ఉండకూడదు
- జూన్ 21న జరిగే యోగాడే కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలి
- విశాఖ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



విశాఖపట్నం (చైతన్యరథం): యోగా అంటేనే భారతీయ వ్యవస్థలో సాంప్రదాయంగా వస్తున్న ఒక వ్యవస్థ అని, యోగా అంటే ఆసనాలు చేయడం కాకుండా,యోగా మన దైనందిన జీవిత కార్యక్రమంలో ఒక భాగం అవ్వాలని జిల్లా ఇంచార్జి మంత్రి మరియు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఆర్కే బీచ్ వద్ద నిర్వహించిన యోగ డే వేడుకలలో ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, హోంమంత్రి వంగల పూడి అనిత, ప్రభుత్వ విప్ పి.వి.ఆర్ గణబాబు, వేపాడ చిరంజీవి, పాల్గొని యోగ ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ... ఆరోగ్యమే మహా భాగ్యమని, మన ఆరోగ్యం మనకు గొప్ప ఆస్తి అన్నారు.మన ఆహారపు అలవాట్లు మారుతున్నాయి, పాత తరం ఆహారం వైపు అడుగులు వేస్తున్నామని, అందరిలో ఆరోగ్య భద్రత పెరిగిందని, యోగాంధ్ర లో యోగాసనాలు కార్యక్రమం అందరికీ ఆరోగ్యాన్ని ఇస్తుందని తెలిపారు. జూన్ 21 న ప్రధాని మోదీ యోగాడే కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ రావడం విశాఖ నగర ప్రజల అదృష్టం. రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమంలో 2 కోట్ల మంది ప్రజలను భాగస్వామ్యుల్ని చేస్తున్నాం. ప్రధాని మోదీ యోగా కార్యక్రమంతో విశాఖ ప్రపంచ రికార్డులకు ఎక్కనుంది. జూన్ 21న జరిగే యోగాడే కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు.

అనంతరం కలెక్టరేట్లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ... ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో అధికారులు సమన్వయం వహించాలి. సాధారణ పౌరుల రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని, విశాఖ నగరం ప్రపంచ రికార్డులకు ఎక్కేలా అందరూ కష్టపడాలని పేర్కొన్నారు. పటిష్ట ఏర్పాట్లు చేయాలని, చిన్న లోపం కూడా లేకుండా జాగ్రత్త వహించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. అనంతరం హోం మంత్రితో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన సమావేశంలో చర్చించిన అంశాలను వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నట్లు హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగస్వామ్యం కావాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి కోరారు.

# విశాఖ అభివృద్ధే టీడీపీ ధ్యేయం... సంక్షేమాన్ని పరిచయం చేసిందే టీడీపీ

- చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి...
- విశాఖ మినీ మహానాడులో నేతల వెల్లడి



విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమాన్ని పరిచయం చేసింది తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావేనని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మినీ మహానాడు నిర్వహించారు. తొలుత నందమూరి తారకరామారావు విగ్రహానికి, మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గంటా మాట్లాడుతూ... ఎన్టీఆర్ తరువాత పగ్గాలు చేపట్టిన చంద్రబాబునాయుడు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ఎంతో కృషిచేశారన్నారు. అటు ప్రభుత్వం, ఇటు పార్టీలో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. మూడో తరంలో లోకేష్ ప్రపంచంలోనే ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా కార్యకర్తల సంక్షేమానికి నిధి ఏర్పాటుచేశారన్నారు. పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారానికి తీర్మానాన్ని ప్రతిపాదించగా అందరూ ఆమోదించారని, ఇదే అంశం కడప మహానాడులో ప్రస్తావిస్తామన్నారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ... సింహాచలం పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం అవుతుందని, కోర్టు కేసుకు త్వరలో మోక్షం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ముడసర్లోవ పరిసరాల్లో రైల్వేకు 52 ఎకరాలు ఇచ్చారని, ఆ భూముల్లో ఉన్న నిరుపేదలకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. మెట్రో రైలుకు వచ్చే అక్టోబరులో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ... 1995లో పెందుర్తి జడ్పీటీసీ సభ్యునిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించింది నందమూరి తారకరామారావేనన్నారు. 2019-24 మధ్య దుర్మార్గుడి చేతిలో రాష్ట్రం నాశనం కావడంతో ప్రజలు గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఏకపక్షంగా తీర్పు చెప్పారన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ... క్రమశిక్షణ కలిగిన పేదల పార్టీ కావడంతో తెలుగుదేశం ఉమ్మడి ఏపీలోనూ, ప్రస్తుతం నవ్యాంధ్రలోను మనుగడ సాగించగలుగుతుందన్నారు. దూరదృష్టితో పాలిస్తున్న చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ... పార్టీలో 70 ఏళ్లు దాటిపోతున్న వారిని గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. సీనియర్ నాయకులకు జిల్లా కమిటీలలో స్థానం కల్పించాలని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ... కార్యకర్తల సంక్షేమమే పార్టీ ధ్యేయమన్నారు. మినీ మహానాడుకు అధ్యక్షత వహించిన విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ... విశాఖపట్నానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారని అన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. మినీ మహానాడులో చేసిన తీర్మానాలను మహానాడుకు పంపిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ... విశాఖ ఉత్తర నియోజకవర్గానికి వెంటనే ఇన్‌చార్జిని నియమించాలని కోరారు. ఇన్‌ఛార్జ్ లేకపోవడంతో నాయకులు, కార్యకర్తల ఇబ్బందులు పట్టించుకునేవారు లేరన్నారు. సమావేశంలో విశాఖ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, పార్టీ నాయకులు చోడే వెంకట పట్టాభి, కోరాడ రాజబాబు, అక్కరమాని విజయనిర్మల, వెల్లంకి భరత్, గొంప కృష్ణ, లొడగల కృష్ణ, తెలుగు మహిళ, యువత, బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి, తాతాజీ, విజయకుమార్, బుడుమూరు గోవిందరావు, తోటరత్నం, ఈతలపాక సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- బొబ్బిలిలో ప్రజాదర్బార్‌ను చేపట్టిన ఎమ్మెల్యే బేబీనాయన



బొబ్బిలి (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. శనివారం బొబ్బిలి కోటలో గల తన క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. పట్టణం, పలు మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖ డీఈతో నియోజకవర్గ పనులపై సమీక్షించి, పలు సూచనలు చేశారు. అలాగే టీడీపీ పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు ఎమ్మెల్యేని కలిసి పలు వార్డులకు సంబంధించిన సమస్యలను వివరించారు.

### సీహెచ్‌సీ మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం

బొబ్బిలి సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే బేబీనాయన సందర్శించారు. ఆసుపత్రిలో ఉన్న పాత భవనాన్ని పరిశీలించి, మరమ్మతులు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సూపరెంటెండెంట్ శశిభూషణరావు, వైద్యులతో మాట్లాడి ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సౌకర్యాలు, ఆహారం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెడ్స్ తక్కువ ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరగా, ఆ దిశగా చరలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# ప్రజా సమస్యలపై గొండు శంకర్ పరిష్కారం



శ్రీకాకుళం (చైతన్యరథం): ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతులపై శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అక్కడికక్కడే స్పందించి పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నగరంలోని విశాఖ-ఏ కాలనీలో గల తన క్యాంపు కార్యాలయంలో ఆయన శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం నగరం, రూరల్ మం డలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్తు, పారిశుధ్యం, డ్రెయిన్లు, రోడ్లు, తాగునీరు, సాగునీరు వంటి మౌలిక వసతులపై అర్జీలు అందుతున్నాయని, వాటి పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తానన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మహాలక్ష్మినగర్ కాలనీకి చెందిన వనరాస సురేష్ సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.66,900 చెక్కును ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం అందజేశారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్



అముదాలవలస (చైతన్యరథం): సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పట్టణంలో టీడీపీ కార్యాలయంలో శు క్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, టీడీపీ నాయకులు మొదలవలస రమేష్, సనపల ఢిల్లీశ్వరరావు, నూకరాజు, అంబళ్ల రాంబాబు, బలగ శంకర్ భాస్కరరావు, అన్నెపు రాము పాల్గొన్నారు. విశాఖపట్నం, మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన ఓ మహిళకు కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ కావడంతో ప్రజల్లో భయాం దోళన మొదలైంది. ఈ క్రమంలో కూన రవికుమార్, టీడీపీ అధికార ప్రతినిధి మొదల వలస రమేష్ మాస్కులు ధరించి ప్రజల మధ్యకు వచ్చారు. ప్రస్తుతం కరోనా మళ్లీ వ్యాపి స్తున్నట్టు వస్తున్న ప్రచారం కంటే మాస్కుల వాడకంపై ప్రచారం చేయాల్సిన అవసర ఉందని, అందుకే ప్రజాదర్బార్‌కు మాస్కులు ధరించి వచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

# చారిత్రాత్మక నిర్ణయాలకు కడప మహానాడు వేదిక

**•కడప మహానాడు ఏర్పాట్లు పరిశీలించిన చీఫ్ విప్ జీవీ, బీటెక్ రవి**



వినుకొండ (చైతన్యరథం): కడపలో ఈనెల 27, 28.29వ తేదీల్లో నిర్వహించనున్న తెలుగుదేశంపార్టీ మహానాడు చారిత్రక నిర్ణయాలకు వేదిక కానుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో జగన్ రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులకు కూడా నీళ్లు ఇవ్వలేక పోయారని ఎద్దేవా చేసిన ఆయన వారికి లక్షల కోట్లు దోచుకోవాలనే ఆలోచన తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవన్నారు. ఆ పరిస్థితులు మార్చి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమకు కొత్త చరిత్ర రాస్తున్న వివరాలు కూడా మహానాడు వేదికగా వెల్లడి స్తామన్నారు. కడప నగర సమీపంలోని పబ్బాపురం వద్ద 150 ఎకరాల్లో జరగనున్న మహానాడు వేదుక ఏర్పాట్లను శనివారం చీఫ్‌విప్ జీవీ పరిశీలించారు. మహానాడు జనసమీకరణ కో-కన్వీనర్, పులివెందుల నియోజకవర్గ జనసమీకరణ ఇన్ ఛార్జిగా ఉన్న ఆయన పులివెందుల తెదేపా ఇన్ ఛార్జి బీటెక్ రవితో కలిసి మహానాడు ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ నెల 25 నాటికి ఏర్పాట్లు పూర్తి కానున్నట్లు తెలిపారు. అనంతరం మాట్లాడిన రైతుల తలసరి ఆదాయం పెంచే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ముందుకు వెళు_న్నారన్నారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమలో అనేక ప్రాజెక్టులు చేపట్టి సాగునీరు అందించామన్న జీవీ తెలుగుదేశం గత ప్రభుత్వ హయాంలోనూ సీమ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేయాలని దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. రైతులకు నీళ్లు ఇవ్వగలిగితే బంగారు పంటలు పండించగలుగుతారని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఈ 43వ వార్షికోత్సవానికి మరో ప్రత్యేకత కూడా ఉందన్నారు జీవీ. తెలుగుదేశం పార్టీ చరిత్రలో తొలిసారి కడప కేంద్రంగా మహానాడు జరుగుతుండటంతో రాయలసీమ ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గతేడాది ఎన్నికల్లో 94%స్థానాల్లో కూటమి విజయం సాధిస్తే సీమ ప్రాంతంలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నామని, దానికి కృతజ్ఞతగా కడప గడ్డపై మహానాడు పండుగ జరుపుకుంటున్నామని తెలిపారు. 29న జరిగే భారీ బహిరంగ సభకు లక్షల్లో రాబోతున్నారని వెల్లడించారు. రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడంపై మహానాడు వేదికపై సమగ్రంగా చర్చిస్తామన్నారు. అలాగే రాయలసీమ అభివృద్ధే లక్ష్యంగా గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో తీసుకున్న చర్యలు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయాలపైనా చర్చించనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై రూపొందించిన 14 ముసాయిదా తీర్మానాలు, నాలుగు ఉమ్మడి తీర్మానాల్ని చర్చించి ఆమోదించనున్నామని తెలిపారు.

# నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**•అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ**



బాపట్ల (చైతన్యరథం): మున్సిపల్ హై స్కూల్‌లో 1 కోటి 48 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న తరగతి భవనాల పనులను బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ... 2014 నుండి 2019 వరకు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మున్సిపల్ హై స్కూల్‌కి అదనపు తరగతి గదులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పూర్తి చేసే సమయంలో ఎలక్షన్ కోడ్ రావడం వలన పనులు ఆగిపోయాయి అని అన్నారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ తరగతి నిర్మాణాలను పూర్తిగా పక్కన పెట్టిందని అన్నారు. 5 సంవత్సరాల కాలంలో కనీసం పట్టించుకోలేదు అని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విషయాన్ని గౌరవ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టిలోకి తీసుకువెళ్లగా గత డిసెంబర్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బాపట్ల మున్సిపల్ హై స్కూల్ పర్యటనకి వచ్చి నిధులు మంజూరు చేసారని అన్నారు. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభానికి పూర్తి చేసి పిల్లలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ నాగిరెడ్డి, మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో గ్రౌండ్స్ అభివృద్ధే ఏసీఏ లక్ష్యం

**•కర్నూల్‌లోని మునగాలపాడులో క్రికెట్ గ్రౌండ్ పరిశీలించిన ఎంపీ కేశినేని శివనాథ్**



విజయవాడ (చైతన్యరథం): రాబోయే కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం క్రీడాంధ్రప్రదేశ్ కానుంది. రాష్ట్రంలోని క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ప్రతి నియోజకవర్గంలో గ్రౌండ్స్ అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావటమే లక్ష్యంగా ఏసీఏ కృషి చేస్తుందని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. కర్నూల్ పట్టణం మునగాలపాడు ప్రాంతంలోని కర్నూల్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని క్రికెట్ గ్రౌండ్‌ను శనివారం రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్ బాషా, కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజులతో కలిసి ఎంపి కేశినేని శివనాథ్ పరిశీలించారు. కలెక్టర్ రంజిత్ బాషాను గ్రౌండ్ వివరాలు ఎంపీ కేశినేని శివనాథ్ తెలుసుకున్నారు. మంత్రి టీజీ భరత్, కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు సహకారంతో త్వరలోనే మునగాల పాడులోని క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రికెట్ గ్రౌండ్ ను అభివృద్ధి చేస్తే కర్నూల్ కు కొత్త కళ సంతరించుకుంటుందన్నారు. మౌలిక సదుపాయాలు లేక యువత క్రీడల పై దృష్టి పెట్టడం లేదని, యువతను క్రీడల వైపు ప్రోత్సహించటమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కర్నూల్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోవింద రెడ్డి, కర్నూల్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రమేష్ లతో పాటు కర్నూల్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పలు విభాగాల ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి...పేదలకు పెన్నిధి

## గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ (చైతన్యరథం): సీఎం రిలీఫ్ ఫండ్ నిధి.. కష్టాల్లో ఉన్న పేదలకు పెన్నిధి వంటిదని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ టీడీపీ కార్యాలయం (ప్రజావేదిక)లో... నియోజకవర్గ పరిధిలోని 15బాధిత కుటుంబాలకు, 8 లక్షల,49 వేల, 063 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే రాము శనివారం సాయంత్రం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే రాము మరియు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న రోజుల వ్యవధిలో చెక్కులు రావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీడియాతో మాట్లాడారు... .ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుంది అన్నారు. గుడివాడ నియోజకవర్గంలో ఏ ఒక్కరు వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదని ఆశయంతో నా వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది వ్యవధిలో నియోజకవర్గ పరిధిలోని బాధ్యత కుటుంబాలకు కోటిన్నర సీఎం రిలీఫ్ అండ్ చెక్కులు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యశాలలో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులను ఆదుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.గుండెజబ్బు వస్తే రూ.60వేలు విలువైన ఇంజక్షన్ను గుడివాడ ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. జగన్ ఆర్థిక అరాచకాలు సృష్టించి, అప్పులు చేసి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని విమర్శించారు. కష్టమైనా అభివృద్ధి, సంక్షేమం దిశగా చంద్రబాబు పాలన అందిస్తున్నారన్నారు.

# గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని, అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పిస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. శనివారం గుంటూరు 45వ డివిజన్‌లోని చైతన్యపురి, గౌతమి నగర్‌లో సుమారు రూ.72.20 లక్షల అభివృధ్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్రలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 45వ డివిజన్ చైతన్యపురి, గౌతమి నగర్‌లో రూ.72.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు మరియు ఆర్ సీసీ కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయటం జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి చోట రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నాం. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గములో మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా సరఫరా చేశాం. అదేవిధంగా నేడు వర్షాకాలన్నీ దృష్టిలో ఉంచుకొని కాలువల్లో పూడికతీత వంటి పనులకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాము. మేయర్, కార్పొరేటర్ల సహకారంతో నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీనిచ్చారు.

**మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ....**

ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గత వైసీపీ హయాంలో సీసీ డ్రైన్లు కూడా నిర్మించకపోవటం వలన వర్షాకాలంలో వరదలు వచ్చాయి. తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలతో కలసి సమన్వయంతో పనిచేస్తున్నాము. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో నియోజకవర్గం గ్రీన్ అండ్ క్లీన్ నియోజకవర్గంగా మారుతుంది. ఈ కార్యక్రమంలో వడ్లమూడి వెంకటేశ్వర్ రావు, కొమ్మినేని కోటేశ్వరరావు, బెజవాడ కృష్ణా రెడ్డి, కూరుకుల శోభా రాణి, రఫీ, ములక సత్య వాణి, మీరా,రామారావు తదితరులు పాల్గొన్నారు.

# మాచర్లలో ఇద్దరు టీడీపీ వర్గీయుల హత్య



మాచర్ల (చైతన్యరథం): నియోజకవర్గంలో శనివారం జంట హత్యలు కలకలం రేపాయి. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెలుగుదేశం పార్టీ వర్గీయులు దారుణ హత్యకు గురయ్యారు. బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని కారుతో ప్రత్యర్థులు ఢీకొట్టారు. కిందపడిన ఇద్దరిని గొడ్డళ్లతో ప్రత్యర్థులు నరికి చంపారు. మృతులు గుండ్లపాడుకు చెందిన వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులుగా గుర్తించారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. రాజకీయ కక్షలే ఈ హత్యలకు దారితీసినట్లు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## రైతు శ్రేయస్సే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయం

●మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి



మార్కాపురం (చైతన్యరథం): రైతు శ్రేయస్సే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయం అని మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శనివారం పొదిలి పట్టణంలోని టొబాకో బోర్డును సందర్శించారు. అనంతరం సూపరిండెంట్ కార్యాలయంలో వివిధ పొగాకు కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈ పొగాకు బోర్డును సందర్శించడం జరిగిందని ఆయా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడటం జరిగిందన్నారు. వచ్చే సోమవారం నుండి లోగ్రేడ్ బెల్లను అందరూ ప్రతినిధులు అధిక సంఖ్యలో కొనుగోలు చేయనున్నారని, రైతులేవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, రైతులకు ఏ కష్టం వచ్చిన మీ వెన్నంటి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కందుకూరుకు మరో 10 వాటర్ ప్లాంట్లు

●విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరింత ప్రోత్సాహం అందిస్తాం

●లింగసముద్రం, కరేడులో అమృత ధార వాటర్ ప్లాంట్ల ప్రారంభం

●హాజరైన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరు (చైతన్యరథం): వెనుకబడిన ప్రాంతం కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. లింగసముద్రం మండల కేంద్రంలోని కేఆర్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విపిఆర్ అమృతధార వాటర్ ప్లాంట్‌ను శనివారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా పాఠశాల ఆవరణకు చేరుకున్న ఎంపీ, ఎమ్మెల్యేకు పాఠశాల విద్యార్థులు కోలాటంతో అపూర్వ పలికారు. అనంతరం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. మహిళలకు బిందెలతో నీటిని అందించారు. వాటర్ ప్లాంట్ భవన నిర్మాణ దాత, పాఠశాల పూర్వ విద్యార్థి అంగులూరి నరసింహారావును ఎంపీ వేమిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కందుకూరులో ఇప్పటివరకు ఒక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, ఇప్పుడు మరో రెండు వాటర్ ప్లాంట్లను ప్రారంభించామన్నారు. కందుకూరుకు ప్రాధాన్యతనిస్తూ మరో 10 వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అవి వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ వల్ల అటు విద్యార్థులతో పాటు గ్రామస్తులకు కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. దాదాపు 2,000 మందికి మేలు జరుగుతుందని వివరించారు. లింగసముద్రం మండలం తమకు మంచి మెజార్టీ ఇచ్చి గెలిపించిందని, ఈ ప్రాంత అభివృద్ధికి తప్పకుండా కట్టుబడి ఉన్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేయనున్నారని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా వాటిని తట్టుకొని సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. పాత, కొత్త నాయకులందరూ కలిసి సమన్వయంతో ముందుకు సాగాలని, ఏమైనా చిన్న సమస్యలుంటే పరిష్కరించుకొని 2029 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ... మెట్ట ప్రాంతమైన కందుకూరుకు విపిఆర్ అమృతధార వాటర్ ప్లాంట్లను కేటాయించిన ఎంపీ వేమిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వాటర్ ప్లాంట్ ద్వారా దాదాపు 2000 మందికి ప్రయోజనం ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. యువ నాయకుడు నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం ముందుకు సాగుతోందని, పాఠశాల విద్య సమూలంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రస్తావించిన పలు సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## అపన్నులకు అండ సీఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే ముక్కు



కనిగిరి (చైతన్యరథం): అపన్నులకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వ్యాఖ్యానించారు. అనారోగ్యానికి గురై వైద్యానికి డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా ఉందన్నారు. శనివారం నియోజకవర్గంలో 51 మంది లబ్ధిదారులకు రూ.50.14 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ... ప్రజా సంక్షేమం కోసం నిబద్ధతతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ఆర్థికంగా బలహీనంగా ఉన్న రోగులకు ఈ సహాయ నిధి ఎంతో ఉపశమనం కలిగిస్తుందన్నారు. కనిగిరి నియోజకవర్గంలో, వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి చెక్కులు అందించడం జరిగిందన్నారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అవసరమున్న ప్రతి పేదవానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు.

## టీడీపీ కార్యకర్తలు అధైర్యపడొద్దు... అండగా ఉంటా : పరిటాల సునీత



రాప్తాడు (చైతన్యరథం): కొంతమంది పోలీసు అధికారులు వైసీపీ కండువా కప్పుకుని పనిచేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం శ్రీ సత్యసాయి జిల్లాలో మినీ మహానాడు జరిగింది. ఈ కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మీడియాతో మాట్లాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన పార్టీ టీడీపీ అని ఉద్ఘాటించారు. ఎంతోమందికి రాజకీయ భిక్ష పెట్టిన పార్టీ తెలుగుదేశమని గుర్తుచేశారు పరిటాల సునీత. ఐదేళ్లు కార్యకర్తలు కష్టపడ్డారని.. ఒక్కొక్కరిపై గత జగన్ ప్రభుత్వంలో 20, 30 కేసులు పెట్టారని పరిటాల సునీత ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు పోలీసులు ఇంకా అదే ముసుగు వేసుకున్నారని.. టీడీపీ కార్యకర్తలపైనే ఇంకా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కార్యకర్తల్లో ఉత్సాహం వచ్చేలా పని చేస్తామని అన్నారు. జాకీ పరిశ్రమ ఓ దుర్మార్గుడు నిర్వాకం వల్ల వెనక్కి వెళ్లిపోయిందని చెప్పుకొచ్చారు. పరిటాల రవీంద్రకి రాజకీయ భిక్ష పెట్టిన నాయకుడు ఎన్టీఆర్ అని ఉద్ఘాటించారు. చంద్రబాబుకు ఇచ్చిన మాట కోసం పార్టీ టికెట్‌ను పరిటాల శ్రీరామ్ త్యాగం చేశారని గుర్తుచేశారు. ధర్మవరం టీడీపీ కార్యకర్తలు నేతలు ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని ప్రతి కార్యకర్తను పరిటాల కుటుంబం కాపాడుకుంటుందని పరిటాల సునీత హామీ ఇచ్చారు.

## పసుపు పండుగ మహానాడుకు మైనారిటీ సోదరులు తరలిరావాలి

● టీడీపీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షేక్ మొహమ్మద్ నూర్ పిలుపు



అమరావతి (చైతన్యరథం): ఈనెల కడపలో 27,28,29వ తేదీల్లో జరిగే మూడు రోజుల పసుపు పండగకు మైనారిటీలు సోదరులుతరలిరావాలని రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మహమ్మద్ నూర్ పిలుపునిచ్చారు. అన్న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా జరుపుకునే పండుగ మహానాడు కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని కోరారు. పేద, బడుగు, బలహీనవర్గాల కోసం స్థాపించిన పార్టీ తెలుగుదేశం పార్టీ. పార్టీ స్థాపించిన 9 నెలలోనే అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించిందని, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత అన్న ఎన్టీఆర్ దక్కుతుందన్నారు. గత 40 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేస్తూ అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దక్కుతుంది. అభివృద్ధి అంటే గుర్తొచ్చేది బాబేనని అన్నారు. దేశంలో ఏదైనా సెక్యులర్ పార్టీ ఉందంటే అది ఒక్క తెలుగుదేశంపార్టీనేనని, పార్టీ స్థాపించిన నుంచి మైనార్టీలు పార్టీకి అండగా ఉన్నారన్నారు. సోదరులందరూ కలిసి పెద్దఎత్తున మహానాడుకు తరలిరావాలని ఈ పసుపు పండగా మహానాడును జయప్రదం చేద్దామని ఈ సందర్భంగా మహమ్మద్ నూర్ పిలుపునిచ్చారు.

## కూటమి ప్రభుత్వం ప్రజల మేలు కోరే ప్రభుత్వం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాజమండ్రిలోని ఆర్ అండ్ బి కంపోస్టు యార్డు సమీపంలో నివసించే ప్రజలకు ఇక మంచి రోజులు వచ్చాయని, దశాబ్ద కాలంగా ఇక్కడ ఉన్న దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. రూ.5.72 కోట్లతో పేపర్ మిల్లు ఎదురు రోడ్డులోని డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన లెగసీ వేస్ట్ మేనేజ్మెంటు ప్లాంట్ ను శనివారం ఆయన టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, కొయ్యల రమణ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... లెగసీ వేస్ట్ మేనేజ్మెంటుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. దీనివల్ల బయో ట్రీట్మెంట్ అయ్యాక ఇక్కడ చెత్తకు సంబంధించిన చిన్న వ్యర్థం కూడా ఉండదని ఆయన అన్నారు. రాష్ట్రం, కేంద్రం, నగరపాలక సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన చెప్పారు. ఆరునెలల్లో పూర్తవుతుందని, అక్టోబరు 2 నాటికి స్థానిక 42, 45, 46 వార్డుల ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటారని ఆయన అన్నారు. ఈ కంపోస్టు యార్డు సమీప ప్రజలు పడిన ఇబ్బందులు తనకు తెలుసని, అందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లెగసీ వేస్ట్ మేనేజ్మెంటులో చెత్త ట్రీట్మెంట్ జరిగాక మిగిలిన వ్యర్థాలన్నింటిని ఇక్కడ నుంచి తరలిస్తారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పష్టం చేశారు. కాకినాడ మాదిరి రాజమండ్రిలో కూడా జిందాల్ తో ఒప్పందం చేసుకుంటామని, ఇప్పటికేప్రభుత్వంతో ఎంఓయూ అయిందని, మంత్రి నారాయణ ఆరు ఎకరాల్లో దీని కోసం చర్యలు చేపడుతున్నారని ఆయన చెప్పారు. కమిషనర్ దృష్టి సారించారని, ఇది అమలు జరిగితే సాయంత్రం ఇళ్ళలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించి ట్రీట్మెంట్ చేస్తారని ఆయన తెలిపారు. తమ కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని, ప్రజల మేలు కోరే ప్రభుత్వం అని ఆయన వ్యాఖ్యానించారు. ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి చేస్తూన్నామని ఆయన అన్నారు. క్వారీ ప్రాంతంలోని చౌడేశ్వరి నగర్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆర్.అండ్ బి సమీపంలో ఉన్న కమ్యూనిటీ హాలును వైసీపీ పాలనలో పట్టించుకోలేదని ఇప్పుడు రూ. 50 లక్షలతో తిరిగి బాగు చేయిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. ఈ ప్రాంతంలోని 5 వేల మంది ప్రజలకు ఉపయోగపడే విధంగా రైతు బజారు

# అనంత ప్రభుత్వాసుపత్రిలో విశ్రాంతి ధామమ్‌కి భూమి పూజ



●కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా... ప్రభుత్వాసుపత్రుల్ని మారుస్తున్నాం

●విశ్రాంతి ధామమ్ భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం (చైతన్యరథం): ప్రభుత్వాసుపత్రిలో రోగుల అటెండర్ల సౌకర్యం కోసం రాష్ట్రంలో మూడవ విశ్రాంతి ధామమ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఈ విశ్రాంతి ధామమ్ నిర్మాణానికి శనివారం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అహుడా చైర్మన్ టీసీ వరుణ్, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, మాజీ ఎంపీ సైపుల్లా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్‌తో పాటు ప్రభుత్వాసుపత్రి వైద్యులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. 75 లక్షల రూపాయలతో విశ్రాంతి ధామమ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ... ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండర్లు పడుతున్న ఇబ్బందులు చూసి ఇలాంటి విశ్రాంతి ధామమ్ నిర్మించాలని ఎంపీని కోరగా.. ఆయన తన ఫండ్స్ నుంచి నిధులు ఇచ్చారన్నారు. ప్రస్తుతం 560 పడకల ఆసుపత్రిగా ఉన్నప్పటికీ 1200 మంది చికిత్సలు అందుతున్నాయన్నారు. 2500 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి 1200 పడకల ఆసుపత్రిగా మార్చాలని కోరినట్టు చెప్పారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వాసుపత్రులు మారుస్తున్నామన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న విశ్రాంతి ధామమ్ ఫస్ట్ ఫ్లోర్‌లో ముంబై తరహాలో డార్మెట్రి కూడా నిర్మిస్తామన్నారు. నామ మాత్రపు ఛార్జీలతో అటెండర్లు ఉండేలా చూస్తామన్నారు. ఇంకా మిగిలిన ఆసుపత్రిలో కూడా ఇలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని దగ్గుపాటి విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఇలాంటి విశ్రాంతి ధామమ్ మూడవదిగా చెప్పారు. రోగులు అటెండర్లు ఆసుపత్రి ప్రాంగణంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని... అందుకే దీనిని తీసుకొచ్చామన్నారు. మిగిలిన ఆసుపత్రిలో కూడా ఇలాంటివి నిర్మించే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. విశాఖ, తిరుపతి తర్వాత అనంతపురంలో ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లిపాల కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే సెంట్రల్ ల్యాబ్ కూడా నిధులు కేటాయించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇంకా పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి ఇక్కడ రోగులకు మెరుగైన సౌకర్యాలు అందే విధంగా చూస్తామన్నారు.

# తెలుగునేల ఉన్నంత కాలం టీడీపీ శాశ్వతం

●పుట్టపర్తిలో అంగరంగ వైభవంగా సత్యసాయి జిల్లా మినీ మహానాడు

●కదనోత్సాహం రగిలించిన మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు ప్రసంగం



మడకశిర(చైతన్యరథం): తెలుగు నేల ఉన్నంత కాలం తెలుగుదేశం ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచి ఉంటుందని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు పేర్కొన్నారు. టీడీపీ మహానాడుకు సన్నాహకంగా శనివారం పుట్టపర్తి పట్టణం మామిళ్లకుంట క్రాస్ వద్ద సత్యసాయి జిల్లా మినీ మహానాడు జరిగింది. జిల్లా మంత్రి సవితమ్మ, ఎంపీ బి.కె.పార్థసారథి, జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు, టీడీపీ సీనియర్ నాయకులతో పాటు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి పాల్గొన్నారు. ముందు గా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా మినీ మహానాడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.రాజు మాట్లాడు తూ పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి మండల వ్యవస్థను తీసుకువచ్చి బడుగులను రాజ్యాధికారంలో భాగస్వాములు కావడానికి కారకులైన మహా నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ మధ్య వైసీపీ సోషల్ మీడియాలో జగన్ ఫొటో చూసి భయపడుతున్నారని కొంతమంది జఫ్ఫాలు పోస్ట్ చేస్తున్నారు. ఆయన పాలనలో ఉన్నప్పుడే పులివెందుల గడ్డపై సైకో పోవాలంటూ నినదించిన దమ్మున్న కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలని గుర్తుచేశారు. ఒక కార్యకర్తను నడిబజారులో మెడ మీద కత్తి పెట్టి జై జగన్ అంటే వది లేస్తామని బెదిరిస్తే.. జై చంద్రబాబు..జై తెలుగుదేశం అని ప్రాణాలొదిలిన తోట చంద్రయ్యను స్ఫూర్తిగా తీసుకున్న వాళ్లం.. మీ ఉడుత ఊపులకు భయపడేది లేదని హెచ్చరించారు. వైసీపీ అణిచివేతలు, అక్రమ కేసులను ఎదుర్కొంటూ కష్ట కాలంలో పసుపు జెండా మోసి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటా మని భావోద్వేగానికి గురయ్యారు. కార్యకర్తలకు అండగా లోకేష్ కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాయలసీమ అభివృద్ధికి బాటలు పడుతున్నాయని, సత్యసాయి జిల్లాకు కియా పరిశ్రమను తీసుకువచ్చి ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. కరువు సీమ ఉమ్మడి అనంతపురం జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మే 27 నుంచి కడప గడ్డపై మూడురోజుల మహానాడు మహాసంబరానికి సత్యసాయి జిల్లా నుంచి భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు బారీగా పాల్గొన్నారు.

# కడప కార్యకర్తల బలం నిరూపించాలి : ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

కడప (చైతన్యరథం): జిల్లాలో టీడీపీ కార్యకర్తల బలమేమిటో నిరూపించేలా మే 27, 28, 29 తేదీలలో కడపలో జరిగే మహానాడుకు తరలిరావాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్ బుక్కపట్నం జయశంకర్ ఆధ్వర్యంలో మహానాడుకు తరలిరావాలని వేసిన పోస్టర్లను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహానాడు విజయవంతం కోసం జయశంకర్ రెండువేల పోస్టర్స్ స్టిక్కర్స్ వేయించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యకర్తలు పార్టీకి పునాదిలాంటి వారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, మాజీ టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కట్టె కాలే వరకు పచ్చ కండువా మెడలోనే ఉంటుంది

●ఆ రోజు పరిటాల రవీంద్రకు ఎన్టీఆర్ ఆ కండువా వేశారు

●నాకు నందమూరి బాలక్రిష్ణ.. పచ్చ కండువా వేశారు

●జిల్లా మినీ మహానాడులో పరిటాల శ్రీరామ్ వ్యాఖ్యలు



పుట్టపర్తి (చైతన్యరథం): కట్టె కాలే వరకు పచ్చ కండువా నా మెడలోనే ఉంటుందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. పుట్టపర్తిలో జరిగిన శ్రీసత్యసాయి జిల్లా మినీ మహానాడు కార్యక్రమంలో సహచర టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీ పార్థసారథితో కలసి పాల్గొన్నారు. ధర్మవరం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణకు పద్మభూషన్ అవార్డు వచ్చిన నేపథ్యంలో అభినందనలు తెలుపుతూ పెట్టిన తీర్మాణం బలపరిచే అవకాశం కల్పించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. నందమూరి కుటుంబానికి మన జిల్లాకు విడదీయరాని బంధం ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నో ప్రాంతాలు ఉన్నప్పటికీ ఆరోజు ఎన్టీఆర్ హిందూపురం నియోజకవర్గాన్నే ఎంచుకున్నారన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతాన్ని ముందుకు నడిపించేందుకు ఆయన చూపిన చొరవ మరువలేనిదన్నారు. అదే విధంగా రాజకీయంగా ఇక్కడున్న ఇబ్బందుల్ని తొలగించి.. ప్రజలకు సమస్యల్ని దూరం చేశారన్నారు. అదే విధంగా నందమూరి బాలక్రిష్ణ కూడా హిందూపురం నియోజకవర్గాన్నే ఎంచుకుని వరుసగా మూడు సార్లు విజయం సాధించారన్నారు. ఆయనకు ఇప్పుడు అవార్డు, రివార్డులు రాగానే పొంగిపోలేదని.. మనం చూపించే ప్రేమాభిమానాలే ఆయనకు గొప్పగా ఉంటాయన్నారు. పరిటాల రవికి ఆ రోజు ఎన్టీఆర్ ఏ విధంగా పచ్చ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారో.. అలాగే నాకు కూడా బాలక్రిష్ణ మొట్టమొదటి సారి కండువా వేశారన్నారు. పరిటాల రవి బడుగు బలహీన వర్గాల పక్షాన నిలబడిన ఆశయాలు నాకు ఏవిధంగా వారసత్వంగా వచ్చాయో.. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలు నందమూరి కుటుంబం నుంచి అదే వారసత్వంగా వచ్చాయన్నారు. చివరి వరకు ఈ కండువా నా మెడలోనే ఉంటుందని శ్రీరామ్ స్పష్టం చేశారు.

# ఘనంగా సత్యసాయి జిల్లాలో మినీ మహానాడు



పుట్టపర్తి (చైతన్యరథం): సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంలోని కప్పల బండ వద్ద ఏర్పాటు చేసిన హిందూపురం పార్లమెంట్ స్థాయి జిల్లా టీడీపీ మినీ మహానాడు అత్యంత ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తిలో నిర్వహించిన హిందూపురం పార్లమెంట్ స్థాయి టీడీపీ మహానాడు పసుపు మయంగా మారింది. ముందుగా టీడీపీ నాయకులు టీడీపీ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రం కప్పలబండ వద్ద నిర్వహించిన హిందూపురం పార్లమెంట్ స్థాయి జిల్లా టీడీపీ మహానాడుకు జిల్లా పార్టీ అధ్యక్షుడు అంజినప్ప అధ్యక్షత వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ, చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవితా, ఎంపీ పార్థసారథి, పుట్టపర్తి, రాప్తాడు, మడకశిర, కదిరి నియోజవర్గ ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, ఎమ్మెస్ రాజు, కందికుంట వెంకట ప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, ధర్మవరం నియోజవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్, డిసిఎంఎస్ చైర్మన్ వెంకటేష్, టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు హజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ... మహెూన్నతమైన వ్యక్తి నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ప్రజలే దేవుళ్ళ సమాజమే దేవాలయం అని భావించి పేదల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించారని పేర్కొన్నారు. తెలుగు జాతి కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యకర్తలకు పండగ వాతావరణాన్ని తీసుకొచ్చిన గొప్ప వేదిక మహానాడు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజలకు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే మరో వైపు అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు దీటుగా ఏపీని ముందుకు తీసుకుపోతున్నారు. కార్యకర్తల సంక్షేమం అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చైతన్యరథం

# విండోషేడ్స్ మూసి ఉంచండి

## - వాణిజ్య విమానాలకు డీజీసీఏ ఆదేశం



న్యూఢిల్లీ: రక్షణ శాఖ వైమానిక స్థావరాల్లో, మరీ ముఖ్యంగా పాక్‌తో సరిహద్దు ఉన్న పశ్చిమ భారత సరిహద్దుల వద్ద విమానాల టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో విండో షేడ్స్ (కిటికీలను మూసి ఉంచే వస్త్రం లేక ఇతర మెటీరియల్)ను మూసివేయాలని వాణిజ్య విమానాలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ శనివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. విమానం టేకాఫ్ అయిన తర్వాత 10వేల అడుగుల ఎత్తుకు వెళ్లేవరకు, ల్యాండింగ్ సమయంలో ఈ ఎత్తుకు దిగిన తర్వాత ఆ నిబంధన వర్తిస్తుంది. ఎమర్జెన్సీ కిటికీల దగ్గర మాత్రం ఇందుకు మినహాయింపు ఉందని తెలిపింది.


పాకిస్థాన్‌తో ఇటీవల ఘర్షణలు తీవ్రస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడికి భారత బలగాలు ఆపరేషన్ సిందూర్‌తో గట్టి బదులిచ్చాయి. ఆది జీర్ణించుకోలేని పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడింది. వాటిని భారత్ తిప్పికొట్టింది. తర్వాత రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఘర్షణ వాతావరణం సద్దుమణిగింది. కానీ దౌత్యపరమైన ఉద్రిక్తతలు మాత్రం కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే డీజీసీఏ సూచనలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఫొటోలు, వీడియోలు నిషిద్ధం**

విమానాల్లో రాకపోకలు సాగించే సమయంలో సైనిక స్థావరాల వద్ద ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉన్న నిషేధం గురించి ప్రయాణికులను అప్రమత్తం చేయాలని కూడా డీజీసీఏ కోరింది. సెక్యూరిటీ ప్రోటోకాల్ దృష్ట్యా ఈ చర్యలు అనివార్యమని, వీటిని ఉల్లంఘిస్తే ఎదుర్కోవాల్సిన లీగల్ చర్యల గురించి కూడా ప్రయాణికులకు వివరించాలని విమానయాన సంస్థల నిర్వాహకులకు స్పష్టం చేసింది. ఆపరేషనల్ సేఫ్టీతో పాటు ప్రయాణికులు తమకు తెలియకుండానే రక్షణపరమైన సమాచారాన్ని షేర్ చేయకుండా నిరోధించేందుకే ఈ చర్యలని తన ప్రకటనలో పేర్కొంది. లేహ్, శ్రీనగర్, జమ్ము, పఠాన్‌కోట్, ఆదంపుర్, చండీగఢ్, బఠిండా, జైసల్మేర్, నాల్, జోద్‌పూర్, హిండన్, ఆగ్రా, కాన్పూర్, బరేలీ, మహారాజ్‌పూర్, గోరఖ్ పుర్, భుజ్, లొహెగావ్, డాబోలిమ్ (గోవా) వైజాగ్‌లోని విమానాశ్రయాలు ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించాల్సి ఉంది.

ఇదిలాఉంటే పాకిస్థాన్‌కు చెందిన విమానాలు భారత గగనతలాన్ని వినియోగించకుండా కేంద్ర ప్రభుత్వం మరోసారి నిషేధాన్ని పొడిగించింది. గతంలో విధించిన గడువు శుక్రవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో నిషేధాన్ని జూన్ 23 వరకు పొడిగిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. భారత విమానాలకు గగనతల మూసివేతను పాకిస్థాన్ మరో నెల పాటు పొడిగించింది. జూన్ 24 తెల్లవారుజామున 4.59 గంటల వరకు తమ గగనతలంలో భారత విమానాలను నిషేదిస్తున్నట్లు పాకిస్థాన్ విమానాశ్రయ అధికారులు (పీఏఏ) వాయు సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. ఇదిలా ఉంటే.. అంతర్జాతీయ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ నిబంధనల ప్రకారం నెల కంటే ఎక్కువ రోజులు గగనతలం వినియోగించకుండా అడ్డుకోవడం కుదరదు. అయితే.. ఇరుదేశాలూ నిషేధం గడువును పొడిగించాయి.

# భారత్‌లో రెండు కొత్త కరోనా వేరియంట్లు



న్యూఢిల్లీ: దేశంలోని పలు రాష్ట్రాలు ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో తాజాగా కరోనా వైరస్ కేసులు వెలుగు చూస్తున్నాయి. కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7లను భారత్‌లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం (ఇన్సా కాగ్) శనివారం వెల్లడించింది. ఎన్‌బీ.1.8.1 రకం కేసు ఏప్రిల్‌లో బయటపడగా.. ఎల్ఎఫ్.7 కు సంబంధించి నాలుగు కేసులు మేలో గుర్తించినట్లు తెలిపింది. అవి తమిళనాడు, గుజరాత్‌లో నమోదయ్యాయి.

ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులను గుర్తిస్తున్నారు. మూడేళ్లలో తొలిసారి ఢిల్లీలో 23 మందికి వైరస్ సోకిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దాంతో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆసుపత్రులను అప్రమత్తమయ్యాయి. కేసులు నమోదవుతున్నప్పటికీ.. తీవ్రత తక్కువేనని ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపింది.

ఇటీవల కాలంలో ఆసియా దేశాలు మరీ ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌ల్యాండ్‌తో పాటు చైనాలోనూ కొవిడ్-19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపర కాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని ఇటీవల సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, బాధితులు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారని వైద్య నిపుణులు వెల్లడించారు.

ఢిల్లీలో కేసులతో అక్కడి బీజేపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, టెస్టింగ్ కిట్స్, వ్యాక్సిన్ల లభ్యత సరిచూసుకోవాలని సూచించింది. వివిధ రకాల శ్వాసకోశ వైరస్ కేసుల వివరాలను పొందుపర్చాలని ఆదేశించింది. వైరస్ వేరియంట్లలో కలిగే మార్పులు ప్రస్తుత వ్యాప్తికి సంబంధం ఉందని, దీంతోపాటు ఇమ్యూనిటీ తగ్గడం కూడా మరో కారణంగా పేర్కొంది. అయితే, ప్రస్తుతం ఆసియా దేశాల్లో కొవిడ్ వ్యాప్తికి కారణంగా భావిస్తున్న జేఎన్.1 రకం 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్' మాత్రమేనని, ఆందోళన కలిగించే రకం కాదని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇదివరకే స్పష్టం చేసింది.

# ఆపరేషన్ సిందూర్‌లో 200 మందికి పైగా మృతి



న్యూఢిల్లీ: ఉగ్రవాదుల ఏరివేత కోసం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో కొత్త వివరాలు బయటికొచ్చాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా న్యూఢిల్లీ జరిపిన ఈ దాడుల్లో పాక్‌లో 200 మందికి పైగా మృతి చెందినట్లు సమాచారం. వీరిలో అత్యధికులు ఉగ్రవాదులు కాగా.. పాక్ మిలిటరీ సిబ్బంది కూడా ఉన్నారు. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలు వెల్లడించినట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి.

మే 7వ తేదీన పాక్, పీఓకే లోని తొమ్మిది ఉగ్రశిబిరాలపై భారత్ మెరుపుదాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో 170 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. బహవల్‌పూర్‌లోని జైషే మహ్మద్ ఉగ్రముఠా ప్రధాన కేంద్రం తీవ్రంగా ధ్వంసమవ్వగా.. ఇక్కడే ఎక్కువ మంది ఉగ్రవాదులు హతమైనట్లు పేర్కొన్నాయి. భారత్ దాడులకు ప్రతిగా సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేయడంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

దీంతో పాక్ ఆట కట్టించేందుకు శత్రుదేశం సైనిక స్థావరాలపై భారత్ బ్రహ్మోస్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో పాక్ కీలక సైనిక స్థావరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇందులో 42 మంది మిలిటరీ సిబ్బంది మరణించినట్లు రక్షణశాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఇక, భారత్ వైపు ఏడుగురు జవాన్లు అమరులైనట్లు సదరు వర్గాలు వెల్లడించాయి. అయితే, ఆపరేషన్ సిందూర్ ఇంకా ఆగిపోలేదని, ప్రస్తుతానికి తాత్కాలికంగా నిలిపివేశామని తెలిపాయి. మన ఆపరేషన్‌తో పాక్‌కు భారీ అవమానం జరిగింది. కచ్చితంగా ఆ దేశం నుంచి ప్రతిస్పందన ఉంటుందని అంచనా వేయొచ్చు. అందుకే భారత్ పూర్తి అప్రమత్తతతో ఉంది. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు మన సైన్యం సంసిద్ధతతో ఉందని రక్షణ శాఖ అధికారి ఒకరు వెల్లడించారు.

# భారత్‌లోకి చొరబాటు యత్నం

### పాక్ జాతీయుడి కాల్చివేత

బనస్కాంత్: భారత్‌లోకి చొరబడేందుకు యత్నించిన పాకిస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తిని సరిహద్దు భద్రతా దళాలు (బీఎస్ఎఫ్) కాల్చివేశాయి. శుక్రవారం అర్ధరాత్రి గుజరాత్లోని బనస్కాంత్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా బలగాలు ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సరిహద్దును దాటి కంచె వైపునకు వస్తున్న ఓ పాకిస్థాన్ వ్యక్తిని గుర్తించాం. వెంటనే అప్రమత్తమై అతడిని నిలువరించేందుకు ప్రయత్నించాం. కానీ, అతడు ముందుకు రావడంతో కాల్పులు జరిపాం. దీంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఇక పహల్గాం ఉగ్రదాడి అనంతరం సరిహద్దుల్లో భద్రతను బలగాలు కట్టుదిట్టం చేసిన సంగతి తెలిసిందే.

# చల్లని కబురు, కేరళను తాకిన నైరుతి

### - రెండు,మూడు రోజుల్లో ఏపీలోకి..

అమరావతి: చల్లని కబురు వచ్చేసింది. దేశానికి అత్యధికంగా వర్షపాతానిచ్చే నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకాయి. సాధారణం కంటే ఎనిమిది రోజుల ముందే ఈ రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ విభాగం వెల్లడించింది. మరో రెండు, మూడు రోజుల్లోనే ఇవి ఏపీలోకి విస్తరించే అవకాశముంది. వీటి ప్రభావంతో జూన్ రెండో వారం నుంచి రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు పలకరిస్తుంటాయి. ఈ సారి మాత్రం చాలా ముందుగానే నైరుతి వచ్చేసింది. అంచనాల కంటే ముందుగానే రుతుపవనాలు రావడం16 ఏళ్లలో ఇదే తొలిసారి. చివరిసారిగా 2009లో మే 23నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి.

**అరేబియా సముద్రంలో వాయుగుండం..**

మరోవైపు, అరేబియా సముద్రంలో దక్షిణ కొంకణ్ తీరానికి సమీపంలో అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది. ఇది గంటకు 6 కిలోమీటర్ల వేగంతో తూర్పు వైపు కదులుతోంది.. మరికొన్ని గంటల్లో ఇది రత్నగిరి, దపోలి మధ్య దక్షిణ కొంకణ్ తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో పశ్చిమ తీరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# పాక్‌కు రహస్య సమాచారం చేరవేత

### గుజరాత్‌లో ఒకరి అరెస్ట్



కచ్: పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్నాడన్న ఆరోపణలతో గుజరాత్లో ఒక వ్యక్తి అరెస్టయ్యాడు. కచ్ సరిహద్దులో అతడిని అరెస్ట్ చేసినట్లు గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) ప్రకటించింది. అతడి పేరు సహదేవ్ సింగ్ గోహిల్ అని, అతడు కచ్, దయాపూర్లో ఆరోగ్య కార్యకర్తగా పనిచేస్తున్నాడని వెల్లడించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) చెందిన కీలక సమాచారాన్ని షేర్ చేసినట్లు అతడి మీద తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

2023లో సహదేవ్‌కు వాట్సప్‌లో అదితి భరద్వాజ్ పేరుతో ఒక యువతి పరిచయమైంది. ఐఏఎఫ్, బీఎస్ఎఫ్‌కు చెందిన నూతన నిర్మాణాల ఫొటోలను ఆమెకు పంపినట్లు తమకు సమాచారం అందిందని ఏటీఎస్ అధికారి సిద్ధార్థ్ మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవాటి దృశ్యాలను షేర్ చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది మే 1న అతడిని ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు ఈ విషయాన్ని గుర్తించారని తెలిపారు. సహదేవ్ నుంచి సమాచారాన్ని సేకరించిన ఫోన్ నంబర్లు పాక్ నుంచి ఆపరేట్ అవుతున్నాయని ఫోరెన్సిక్ పరీక్షలో వెల్లడైందని చెప్పారు. అలాగే ఒక గుర్తుతెలియని వ్యక్తి నిందితుడికి రూ.40వేలు కూడా ఇచ్చారన్నారు.

పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. రెండు వారాల వ్యవధిలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా 10 మందికి పైగా అరెస్టయిన సంగతి తెలిసిందే. నిందితులు పాక్ నిఘావర్గాలకు కీలకమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు ఇప్పటివరకు చేపట్టిన దర్యాప్తులో వెల్లడైంది. వారి ఆర్థిక లావాదేవీలను సునిశితంగా పరిశీలిస్తున్నామని, ఎలక్ట్రానిక్ పరికరాల ఫోరెన్సిక్ విశ్లేషణ కూడా చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.

# సముద్రంపాలైన వలస ప్రాణాలు

**- ఓడలు మునిగి 247మంది రోహింగ్యాలు దుర్మరణం?**



మయన్మార్ తీరంలో రెండు ఓడలు మునిగిపోవడంతో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. 427మంది రోహింగ్యాలు ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. మే 9, 10 తేదీల్లో ఈ ఘోర ప్రమాదాలు జరిగినట్టు ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. ఈ విషయం నిర్ధరణ అయితే 'సముద్రంలో చోటుచేసుకున్న అత్యంత విషాదకర ఘటన'గా ఇది మిగిలిపోతుందని ఆందోళన వ్యక్తంచేసింది ఓడల ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నట్టు ఐరాస అనుబంధ శరణార్థి విభాగం అంచనా వేస్తోంది. తొలి ప్రమాదం మే 9న చోటుచేసుకోగా 267మందిలో 66మంది బతికి బయటపడినట్టు ప్రాథమికంగా వెల్లడించింది. మే 10న రెండో నౌక ప్రమాదానికి గురికాగా.. 21మంది బతికి బయటపడినట్టు సమాచారం. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్లో నివసిస్తుంటారు. కానీ, సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకుగానూ లక్షలాది రోహింగ్యాలు 2017లో బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. మయన్మార్ గతేడాది సైనిక తిరుగుబాటు అనంతరం.. వారి వలసలు మరింత పెరిగాయి. దీంతో దక్షిణ బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వారంతా.. ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

# చిన్నారులను చంపేస్తున్నారు

**ఇజ్రాయెల్ దాడులపై ఎంపీ ఐమన్ వ్యాఖ్యలు - ఎంపీని పోడియం నుంచి లాగేసిన అధికార్లు**



ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణలతో గాజాలోని సామాన్యుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. దీనిపై తాజాగా ఇజ్రాయెల్ ఎంపీ ఐమన్ ఒడె అక్కడి పార్లమెంటులో గళమెత్తారు. గాజాపై టెల్అవీవ్ చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే అక్కడి అధికారులు ఐమన్‌ను పోడియంనుంచి పక్కకు లాక్కెళ్లారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. 'దాదాపు ఏడాదిన్నరగా మీరు 19 వేలమంది చిన్నారుల ప్రాణాలు తీశారు. 53వేల మంది నివాసితులను చంపేశారు. అన్ని విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులను నాశనం చేశారు. అయినప్పటికీ.. రాజకీయపరంగా విజయం సాధించామనే భావనకు రాలేకపోతున్న పిచ్చివాళ్లు మీరు' అని ఒడె ఆరోపణలు చేశారు. ఆయన మాటలతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఐమన్ వ్యాఖ్యలను పార్లమెంటులోని కొందరు సభ్యులు వ్యతిరేకించారు. ఈక్రమంలో ఆయన ప్రసంగిస్తుండగానే అక్కడి అధికారులు పోడియంనుంచి పక్కకు లాక్కెళ్లారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఇక, ఇటీవల గాజాపై ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం చేసింది. దీంతో టెల్అవీవ్ చర్యలపై అంతర్జాతీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలోనే ఐడీఎఫ్ విశ్రాంత చీఫ్ యాయిర్ గొలాన్ కూడా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై ఇటీవల మండిపడ్డారు. చిన్నారులను చంపడం హాబీగా మారిందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోవైపు.. గాజా మొత్తాన్ని తమ నియంత్రణలోకి తీసుకుంటామని నెతన్యాహు ప్రకటించడం తెలిసిందే. 'మా పోరాటం తీవ్రస్థాయిలో ఉంది. పురోగతి సాధిస్తున్నాం. ఆ ప్రాంతం మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకుంటాం. ఇందులో వెనక్కి తగ్గేదేలేదు" అని నెతన్యాహు ప్రకటించారు.

# గందరగోళంలో హార్వర్డ్ విద్యార్థుల భవిత



- **మరో విద్యాసంస్థకు బదిలీ కాకుంటే చట్టబద్ధతకు ముప్పు**
- **800మంది భారతీయులు సహా వేలాది విద్యార్థులపై ప్రభావం**
- **ఆరు షరతులకు వర్సిటీ అంగీకరిస్తేనే ఉపశమనం**
- **ట్రంప్ సర్కారు స్పష్టీకరణ**
- **కోర్టులో సవాలు చేసిన విశ్వవిద్యాలయం**

అమెరికాలోని ప్రతిష్టాత్మక హార్వర్డ్ వర్శిటీలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలను ట్రంప్ యంత్రాంగం నిషేధించడంతో ప్రస్తుతం అక్కడ చదువుతున్న దాదాపు 800 మంది భారతీయులు సహా వేలమంది విదేశీ విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. ఈ విద్యాసంవత్సరం తర్వాత వారంతా ఇతర వర్శిటీలకు బదిలీ కావాల్సిన గందరగోళ పరిస్థితి తలెత్తింది. లేనిపక్షంలో వారు చట్టబద్ధతను కోల్పోయే ముప్పు పొంచి ఉంది. అయితే వర్శిటీ ఆరు షరతులకు అంగీకరిస్తే విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని యథావిధిగా కొనసాగించవచ్చని ట్రంప్ యంత్రాంగం పేర్కొంది. ఈ ఆదేశాలను వర్సిటీ ఫెడరల్ కోర్టులో సవాలు చేసింది. "హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశానికి ఇక వీలు లేనట్టే లెక్క. ప్రస్తుతం అక్కడ చదువుతున్న విదేశీ విద్యార్థులు వేరే వర్సిటీకి బదిలీ కావాలి. లేకుంటే వారిని అక్రమ ప్రవాసులుగా పరిగణించాల్సి ఉంటుంది" అని అమెరికా అంతర్గత భద్రతా విభాగం హెచ్చరించింది. విశ్వవిద్యాలయం అమెరికా వ్యతిరేక, తీవ్రవాద అనుకూల ప్రదర్శనలకు అనుమతినిచ్చి యూదు విద్యార్థులపై దాడులకు కారణమైందని, చైనా కమ్యూనిస్టు పార్టీకి అనుకూలంగా పనిచేసిందని ఆరోపించింది.

**హార్వర్డ్ న్యాయపోరాటం**

విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ట్రంప్ యంత్రాంగం జారీ చేసిన ఆదేశాలను హార్వర్డ్ విశ్వవిద్యాలయం శుక్రవారం ఫెడరల్ కోర్టులో సవాలు చేసింది. ట్రంప్ యంత్రాంగం తీసుకున్న చర్యను హార్వర్డ్ చట్ట వ్యతిరేకమైనదిగా అభివర్ణించింది. ఈ ఆదేశాల నేపథ్యంలో తమ విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తున్నామని తెలియజేసింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్ నగరాల్లో ఉన్న క్యాంపస్‌లలో 6800 మంది విదేశీ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తోంది. దాదాపు 100కు పైగా దేశాల నుంచి విద్యార్థులు ఇక్కడ ఏటా ప్రవేశం పొందుతున్నారు. ప్రస్తుతం హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన మొత్తం 10,158 మంది విదేశీ విద్యార్థులు చదువుతున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఈ విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో కలిపి 788మంది భారతీయ విద్యార్థులు నమోదయ్యారని హార్వర్డ్ అంతర్జాతీయ కార్యాలయ వెబ్సైట్ తెలియజేస్తోంది.

**మరో కేసులో విదేశీ విద్యార్థులకు కోర్టు రక్షణ**

ఇదిలా ఉండగా ట్రంప్ యంత్రాంగం నేరాభియోగాలు ఎదుర్కొంటున్న వేలమంది విదేశీ విద్యార్థుల చట్టబద్ధతను రద్దు చేస్తూ గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ఓక్లండ్‌కు చెందిన డిస్ట్రిక్ట్ జడ్జి జెఫ్రే ఎస్ వైట్ పక్కనపెట్టారు. వారిని వ్యక్తిగతంగా విచారించకుండా అరెస్టులు చేయరాదంటూ ఆదేశించారు. ఇదే అంశంలో దాఖలైన మరో పిటిషన్ ఇంకా పెండింగులో ఉంది.

**షరతులు ఇవీ..**

హార్వర్డ్ విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని కొనసాగించాలంటే 72 గంటల్లోగా ఆరు షరతులకు కట్టుబడాలని ఫెడరల్ ప్రభుత్వం స్పష్టం చేసింది. గత ఐదేళ్లలో వర్సిటీ క్యాంపస్‌లో విదేశీ విద్యార్థులు నిర్వహించిన నిరసన ప్రదర్శనల వీడియో ఫుటేజి ఇవ్వాలని, వారి క్రమశిక్షణ రికార్డులు సమర్పించాలని, విదేశీ విద్యార్థులు చట్టవిరుద్ధ కార్యకలాపాలకుగానీ, హింసకుగానీ పాల్పడినట్లు లేదా వారివల్ల ఇతర విద్యార్థులకు హాని కలిగినట్లు నిర్ధారించే రికార్డులను కూడా సమర్పించాలని స్పష్టం చేసింది.

# అత్యంత క్రూరదశలో యుద్ధం

**- ఆకలితో అలమటిస్తున్న గాజా పౌరులపై దయచూపాలన్న డబ్ల్యుటీవో**



గాజాలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని. వారికి కనీస సదుపాయాలు కూడా అందడం లేదని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ యుద్ధం.. ప్రస్తుతం అత్యంత క్రూరదశలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "దాదాపు. 400 ట్రక్కుల్లో గాజాలోకి సాయం ప్రవేశిస్తే కేవలం 115 ట్రక్కుల సాయం మాత్రమే ఇప్పటివరకు అందింది. గాజా ప్రజలకు ఇప్పుడు వరదలా సాయం అందాలి. కానీ వారికి చెంచాడంత సాయం మాత్రమే లభిస్తోంది" అని పేర్కొన్నారు. గాజాలోని పరిస్థితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. శరణార్థులకు అందించే ఆహారాన్ని ఆయుధంగా మార్చుకోవడం నేరమని, ఇజ్రాయెల్ కాస్త దయచూపాలని కోరింది.

ఈమేరకు వార్షిక సమావేశంలో ఆ సంస్థ అధిపతి టెడ్రోస్ అధనోమ్ భావోద్వేగభరిత ప్రసంగం చేశారు. "ప్రస్తుతం గాజాలోని ప్రజల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోగలను. వారి బాధ నాకు తెలుస్తోంది. యుద్ధం కారణంగా నెలకొన్న భయానక పరిస్థితులు ప్రజలను మానసికంగా క్షోభకు గురిచేస్తున్నాయి. ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. యుద్ధ సమయాల్లో ఆహారాన్ని ఆయుధంగా చేసుకోవడం నేరం. వైద్య సదుపాయాలను అడ్డుకోవడం తప్పు. ఈ యుద్ధం ఇజ్రాయెల్‌కు కూడా మంచిది కాదు. ఇరువైపులా శాంతి అవసరం. ఘర్షణలతో శాశ్వత పరిష్కారం లభించదు. గాజాలోని ప్రజలపై దయ చూపించాలని టెల్అవీవ్‌ను కోరుతున్నా. ఇది ఇరువర్గాలకు, మానవాళికి మంచిది" అని టెడ్రోస్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో గడచిన 24 గంటల్లో 60 మంది పౌరులు మరణించారని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ శుక్రవారం తెలిపింది.

# పరిగెత్తండ్రోయ్..

**ఇన్ఫాంట్రీని వదిలి పరారైన పాక్ కమాండర్**

**'ఆపరేషన్ సిందూర్'వేళ దాయాది ఆర్మీ పరిస్థితి**



సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్కు 'ఆపరేషన్ సిందూర్'తో భారత్ గట్టిగా బుద్ధిచెప్పింది. ఈ ఆపరేషన్లో ఉగ్రమూకల స్థావరాలను తుదముట్టించడంతో పాటు దాయాది సైనిక పోస్టులను ధ్వంసం చేసింది. ఈ ఊహించని ఉత్పాతంతో పాక్ ఆర్మీ కకావికలమైంది. దీంతో ప్రత్యర్థి సైన్యంలో కమాండర్‌స్థాయి అధికారులు కూడా ప్రాణభయంతో పరుగులు పెట్టాయని భారత ఆర్మీ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనం వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్ సమీపంలో ఉన్న 75వ ఇన్ఫాంట్రీ బ్రిగేడ్ కమాండర్ ఆ పోస్టును వదిలి పారిపోయినట్టు సమాచారం. ఆ కమాండర్ గురించి ఓ జూనియర్ అధికారి మాట్లాడిన రేడియో చాట్ బయటకు రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్టు సదరు కథనాలు పేర్కొన్నాయి. "చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మా కమాండర్ సాబ్ ఇక్కడి నుంచి పరారయ్యాడు. ఓ మసీదులో తలదాచుకొని ప్రార్థనలు చేసుకున్నాడు. పోస్టులో కార్యకలాపాలను పునరుద్ధరించాలా? అని అడిగితే.. 'ఆఫీసు తర్వాత తాపీగా తెరుచుకోవచ్చు. ముందు మీ ప్రాణాలు కాపాడుకోండి' అని సమాధానమిచ్చాడు. పరిస్థితులు సద్దుమణిగేవరకు పోస్టుకు తిరిగి రానని ఆ కమాండర్ చెప్పాడు" అని సదరు జూనియర్ అధికారి ఆ చాట్‌లో పేర్కొన్నాడు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్, పీఓకేలోని 9 ఉగ్ర స్థావరాలపై భారత్ మెరుపుదాడులు చేసిన సంగతి తెలిసిందే. లష్కరే, జైషే మహ్మద్‌కు చెందిన కీలక శిబిరాలు ఈ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలువురు టాప్ ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ దాడులకు ప్రతిగా పాక్.. భారత పౌరులను లక్ష్యంగా చేసుకొని డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించింది. దీన్ని మన సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది.

# చివరి మ్యాచ్‌లో పంజాబ్‌కు ఢిల్లీ ఝలక్

## - 6 వికెట్ల తేడాతో ఘన విజయం



ఐపీఎల్ 2025లో ప్లేఆఫ్స్‌కు చేరిన జట్ల పరాజయాల పరంపర కొనసాగుతోంది.గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తర్వాత పంజాబ్ కింగ్స్ కూడా ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పంజాబ్ కింగ్స్ జట్టును 6 వికెట్ల తేడాతో ఓడించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 8 వికెట్లకు 206 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ 4 వికెట్లు కోల్పోయి 3 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. ఢిల్లీ జట్టు తరపున సమీర్ రిజ్వీ, కరుణ్ నాయర్ బ్యాటింగ్ తో అద్భుత విజయాలు సాధించారు.

యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ ఐపీఎల్‌లో తన తొలి అర్ధ సెంచరీ సాధించాడు. రిజ్వీ 22 బంతుల్లో50 పరుగులు పూర్తి చేసుకున్నాడు.సమీర్ రిజ్వీ 25 బంతుల్లో 58 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. తన ఇన్నింగ్స్‌లో రిజ్వీ 3 ఫోర్లు , 5 సిక్సర్లు కొట్టాడు. కరుణ్ నాయర్ 27 బంతుల్లో 44 పరుగులు చేశాడు. కరుణ్ నాయర్ 5 ఫోర్లు, 2 సిక్సర్లు కొట్టాడు. ఢిల్లీ ఓపెనర్లు కేఎల్ రాహుల్(35), ఫాఫ్ డుప్లెసిస్(23) శుభారంభం అందించగా.. సెధిఖుల్లా అటల్(22) పర్వాలేదనిపించాడు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ 2 వికెట్లు పడగొట్టగా.. మార్కో యాన్సెన్, ప్రవీణ్ దూబె తలో వికెట్ తీశారు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 206 పరుగుల భారీస్కోరు చేసింది. పంజాబ్ కింగ్స్ తరపున మార్కస్ స్టొయినీస్ 16 బంతుల్లో అజేయంగా 44 పరుగులు, శ్రేయస్ అయ్యర్ 34 బంతుల్లో 53 పరుగులు సాధించారు. తన అద్భుతమైన ఇన్నింగ్స్ లో స్టొయినీస్ 4 సిక్సర్లు, 3 ఫోర్లు కొట్టి పంజాబ్‌ను 200 పరుగుల మార్కును దాటేలా చేశాడు. పంజాబ్ తరపున నేహాల్ వధేరా(16), శశాంక్ సింగ్(11) పరుగులు చేశారు. ఢిల్లీ బౌలర్లలో ముస్తాఫిజుర్ 3, కుల్దీప్ యాదవ్ 2, విప్రజ్ నిగమ్ 2, ముకేశ్ కుమార్ ఒక వికెట్ పడగొట్టారు.

ఈ నేపథ్యంలోంచి ఢిల్లీ జట్టు ఐపీఎల్ 2025లో తన చివరి మ్యాచ్‌ను 6 వికెట్ల తేడాతో గెలుచుకుని తన గౌరవాన్ని కాపాడుకుంది. అదే సమయంలో, ఈ మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత, పంజాబ్ కింగ్స్ టాప్ 2కి చేరుకోవాలనే కల చాలా కష్టంగా మారింది. అయితే పంజాబ్ కింగ్స్ జట్టు ఇప్పుడు మే 26న ముంబై ఇండియన్స్‌తో ఆడాలి.

# కోహ్లీలో మరో రెండేళ్లు ఆడే సత్తా వుంది: సెహ్వాగ్



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోవడంపై కొంతమంది అభిమానులకు ఇప్పటికీ నమ్మకం లేదు. చాలా మంది విరాట్ కోహ్లీ తన రిటైర్మెంట్‌ను తిరిగి తీసుకొని టెస్ట్ క్రికెట్‌కు తిరిగి రావాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో కొంత మంది మాజీ భారత క్రికెటర్లు కూడా విరాట్ కోహ్లీ కొంచెం ముందుగానే రిటైర్ అయ్యారని భావిస్తున్నారు. ఇందులో వీరేంద్ర సెహ్వాగ్ పేరు కూడా ఉంది. విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌పై వీరేంద్ర సెహ్వాగ్ నుంచి మరోసారి కీలక ప్రకటన వెలువడింది.

**వీరేంద్ర సెహ్వాగ్ కీలక ప్రకటన!**

ఐపీఎల్ 2025లో శుక్రవారం రాత్రి సన్‌రైజర్స్ హైదరాబాద్, ఆర్సీబీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 43 పరుగుల మంచి ఇన్నింగ్స్ ఆడాడు. దీన్ని చూసిన వీరేంద్ర సెహ్వాగ్ మరోసారి తాను ఇంకా రెండేళ్లు టెస్ట్ క్రికెట్ ఆడగలిగేవాడని అన్నాడు. ఖచ్చితంగా విరాట్ టెస్ట్ ఫార్మాట్ నుంచి చాలా త్వరగా రిటైర్ అయ్యాడని తాను అనుకుంటున్నట్లు చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ తన ఫిట్‌నెస్‌ను గమనిస్తే.. ఇంకా రెండు సంవత్సరాలు సులభంగా ఆడగలిగేవాడని వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. కానీ ఈ నిర్ణయం వెనుక గల కారణాలను విరాట్ కోహ్లీ మాత్రమే చెప్పగలడని పేర్కొన్నాడు. ఇది కోహ్లీ వ్యక్తిగత నిర్ణయమని లేదా విరాట్ అలసిపోయినట్లు అనిపిస్తుందని సెహ్వాగ్ అన్నాడు.

**12న రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లీ**

ఐపీఎల్ 2025 తర్వాత టీమిండియా జూన్‌లో ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. భారత్, ఇంగ్లాండ్ 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు ముందే విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. మే 12న సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌ను షేర్ చేయడం ద్వారా విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. విరాట్ కోహ్లీ కంటే ముందు రోహిత్ శర్మ మే 7న సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఇద్దరు దిగ్గజాలు వారం వ్యవధిలో రిటైర్మెంట్ ప్రకటించడంతో అభిమానులు చాలా ఆశ్చర్యపోయారు.

# ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్లకు బీసీసీఐ బిగ్ షాక్!

ఐపీఎల్ 2025లో శుక్రవారం రాత్రి సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరిగింది. లక్నోలోని ఏకానా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇప్పటికే ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించినందున ఈ విజయం జట్టుపై ఎటువంటి ప్రభావం చూపదు. మరోవైపు ఓటమి తర్వాత ఆర్సీబీ పాయింట్ల పట్టికలో ఖచ్చితంగా నష్టాన్ని చవిచూసింది. మ్యాచ్ తర్వాత ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్, సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్‌పై బీసీసీఐ చర్య తీసుకుంది.

ఇద్దరు కెప్టెన్లపై బీసీసీఐ చర్య

ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయలేకపోయాయి. ఈ క్రమంలో రజత్ పాటిదార్, పాట్ కమిన్స్‌లకు బీసీసీఐ స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా విధించింది. ఓ వైపు ఈ సీజన్‌లో రెండోసారి స్లో ఓవర్ రేట్‌ను ఉల్లంఘించినందుకు ఆర్సీబీ దోషిగా తేలింది. దీని కారణంగా కెప్టెన్ రజత్ పాటిదార్‌కు రూ.24 లక్షల జరిమానా విధించగా.. జట్టులోని మిగిలిన ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ.6 లక్షల జరిమానా విధించారు. ఇది కాకుండా ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేసిన మొదటి ఉల్లంఘన కావడంతో కెప్టెన్ పాట్ కమిన్స్‌కు రూ.12 లక్షల జరిమానా విధించబడింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి 2.22 ప్రకారం ఇద్దరు కెప్టెన్లపై బీసీసీఐ ఈ చర్య తీసుకుంది.

ఈ మ్యాచ్‌లో గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఇషాన్ కిషన్ 48 బంతుల్లో 94 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇది కాకుండా అభిషేక్ శర్మ 34 పరుగులు చేశాడు. ఆర్సీబీ తరపున బౌలర్లలో రొమారియో షెఫర్డ్ 2 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత ఆర్సీబీ జట్టు 19.5 ఓవర్లలో 189 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆర్సీబీ తరపున బ్యాటర్లలో ఫిల్ సాల్ట్ 32 బంతుల్లో అత్యధికంగా 62 పరుగులు చేశాడు. ఇది కాకుండా విరాట్ కోహ్లీ 25 బంతుల్లో 43 పరుగులు చేశాడు. హైదరాబాద్ తరపున బౌలర్లలో కెప్టెన్ పాట్ కమిన్స్ గరిష్టంగా 3 వికెట్లు పడగొట్టాడు.



# శుభ్‌మన్ గిల్‌కే టెస్ట్ పగ్గాలు..

ఇంగ్లాండ్‌తో జరిగే 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు టీమిండియా జట్టును అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ప్రకటించింది. టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ విలేకరుల సమావేశం ద్వారా జట్టును ప్రకటించారు. రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత శుభ్‌మన్ గిల్‌ను ఇప్పుడు టెస్ట్ జట్టుకు కొత్త కెప్టెన్‌గా ఎంపిక చేశారు. శుభ్‌మన్ గిల్ టీమిండియాకు నాల్గవ అతిపిన్న వయస్కుడైన కెప్టెన్ అయ్యాడు. వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్‌ను జట్టుకు వైస్ కెప్టెన్‌గా నియమించారు.

**మహ్మద్ షమీ, శ్రేయస్ అయ్యర్‌లకు లభించని అవకాశం**

ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ, మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌లకు ఇంగ్లాండ్ పర్యటనకు అవకాశం దక్కలేదు. ఐపీఎల్ 2025లో షమీ ప్రత్యేకంగా ఏమి చేయలేకపోవడమే దీనికి కారణం. అదే సమయంలో శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్ 2025లో అద్భుతంగా రాణించాడు. అయినప్పటికీ అతడిని జట్టులో చేర్చకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

**సాయి సుదర్శన్-కరుణ్ నాయర్‌లకు దక్కిన చోటు**

ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ తరపున సంచలనం సృష్టించిన సాయి సుదర్శన్ జట్టులోకి ఎంపికయ్యాడు. ఇప్పటివరకు సీజన్ 18లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సాయి సుదర్శన్ నిలిచాడు. ఇది కాకుండా, దేశీయ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన కరుణ్ నాయర్ 7 సంవత్సరాల తర్వాత టీమ్ ఇండియాలో ఎంపికయ్యాడు.

**ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపికైన భారత జట్టు ఇదే..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్( వికెట్ కీపర్,వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురేల్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్ దీప్ సింగ్, ఆకాశ్ దీప్, కుల్‌దీప్ యాదవ్

**ఇండియా vs ఇంగ్లాండ్ సిరీస్ పూర్తి షెడ్యూల్ ఇదే..**

మొదటి టెస్ట్ మ్యాచ్ (జూన్ 20-24)
రెండవ టెస్ట్ మ్యాచ్ (జూలై 2-6)
మూడవ టెస్ట్ మ్యాచ్ (జూలై 10-14)
నాల్గవ టెస్ట్ మ్యాచ్ (జూలై 23-27)
ఐదవ టెస్ట్ మ్యాచ్ (జూలై 31-ఆగస్టు 4)

## ప్రభాస్.. అలా అని ఇప్పుడే తెలిసింది


'ది రాజాసాబ్'తో హీరోయిన్‌గా తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నారు నటి మాళవికా మోహనన్. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలో ఉంది. సోషల్మీడియాలో యాక్టివ్‌గా ఉండే మాళవిక తాజాగా ఎక్స్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. తన తదుపరి సినిమా విశేషాలు, ఇష్టాయిష్టాలు పంచుకున్నారు. ప్రభాస్ గురించి ఆమె మాట్లాడారు. 'ది రాజాసాబ్' వల్ల ప్రభాస్ గురించి తాను ఎంతో తెలుసుకున్నానని అన్నారు.

'ప్రభాస్ని కలవక ముందు.. పలు ఇంటర్వ్యూల్లో ఆయన్ని చూసి తను ఇతరులతో పెద్దగా కలవరనుకున్నా. చాలా సైలెంట్‌గా ఉంటారనిపించింది. కానీ, ఈ సినిమావల్ల ఆయన విషయంలో నా ఆలోచన తప్పని అర్థమైంది. ఆయన ఎంతో సరదాగా ఉంటారని..అద్భుతంగా మాట్లాడతారని తెలుసుకున్నా. ఆయన ఉన్నారంటే సెట్ ఎంతో సరదాగా ఉంటుంది. ఒక్క డల్ మూమెంట్ కూడా ఉండదు' అని మాళవికా మోహనన్ తెలిపారు. ఈ సినిమా టీజర్ అతిత్వరలో విడుదలయ్యే అవకాశం ఉందని చెప్పారు. ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారని అన్నారు.

***'హృదయపూర్వం' సినిమా షూట్ పూర్తైందా?***

–మూడు రోజుల క్రితమే పూర్తైంది. ఆ టీమ్‌తో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. చాలా రోజుల తర్వాత నటించిన మలయాళ చిత్రమిది. ప్రస్తుతం ఆ సినిమా సెట్స్‌ను మిస్ అవుతున్నా.

***'నేను సాధించాను' అని అనిపించిన క్షణం ఏదైనా ఉందా?***



–ఎక్కువసేపు క్యూ లైన్లలో వేచి ఉండకుండా దేవాలయాల్లోకి అడుగుపెట్టిన సమయంలో అనిపిస్తుంది.

***'ది రాజాసాబ్' తర్వాత మీరు తెలుగులో చేస్తున్న చిత్రమేది?***

–మీరే చెప్పండి. నన్ను ఏ హీరోకు జంటగా చూడాలనుకుంటున్నారో.

***నేను మిమ్మల్ని మాలు అని పిలవవచ్చా?***

–నా కుటుంబసభ్యులు, స్నేహితులు అదేవిధంగా పిలుస్తారు. కాబట్టి మీరూ పిలవొచ్చు.

***'వార్ 2' టీజర్‌పై మీ రియాక్షన్ ఏమిటి?***

–టీజర్ చూశాను. పవర్ ప్యాక్డ్ టీజర్. ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ఎనర్జీ, వాళ్ల స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతంగా ఉంది. ఒక్క మాటలో ఫైర్ అంతే.

***మోహన్‌లాల్ లేదా మమ్ముట్టి మీకు ఎవరంటే ఇష్టం?***

–ఒకరు (మమ్ముట్టి) నన్ను సినిమా అనే అందమైన ప్రపంచంలోకి తీసుకువచ్చారు. మరొకరితో (మోహన్‌లాల్) ఇప్పుడు నేనొక అద్భుతమైన చిత్రం చేస్తున్నా. కాబట్టి ఇది సరైన ప్రశ్న కాదు కదా.




## టూరిస్ట్ ఫ్యామిలీకి సూర్య ప్రశంస



వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చి విజయాన్ని అందుకుంది 'టూరిస్ట్ ఫ్యామిలీ'. అభిషాన్ జీవింత్ దర్శకత్వంలో శశికుమార్, సిమ్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాపై దర్శకధీరుడు రాజమౌళితో సహా ఎంతోమంది ప్రముఖులు ప్రశంసలు కురిపించారు. తాజాగా కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ఈ చిత్ర బృందాన్ని అభినందించారు. అభిషాన్ జీవింత్‌ను కలిసిన సూర్య మూవీటీంతో ముచ్చటించారు. సినిమాపై ప్రశంసలు కురిపించారు. ఈ విషయాన్ని తెలుపుతూ దర్శకుడు ఎక్స్ వేదికగా ఆనందం వ్యక్తంచేశారు. "ఈ అనుభూతిని ఎలా వర్ణించాలో తెలియడం లేదు. ఎప్పటినుంచో ఉన్న బాధ ఇప్పుడు తీరినట్లు ఉంది. సూర్య నన్ను కలిశారు. సినిమా ఆయనకు ఎంత నచ్చిందో వివరించారు. 'సూర్య సన్నాఫ్ కృష్ణన్' సినిమాను వందసార్లు చూసిన నేను ఇప్పుడు భావోద్వేగాన్ని అదుపు చేసుకోలేకపోతున్నాను. థాంక్యూ సర్" అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

చిన్న సినిమా.. పెద్ద విజయం..

చిన్న సినిమాగా మే ప్రారంభంలో ప్రేక్షకుల ముందుకువచ్చిన 'టూరిస్ట్ ఫ్యామిలీ' విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ రూ. 75 కోట్లు వసూలు చేసినట్లు టీమ్ తెలిపింది. దీన్ని మరిన్ని భాషల్లోనూ విడుదల చేయాలని భావిస్తున్నారు. నేటినుంచి ఈ చిత్రం జపాన్‌లోనూ అలరించనుంది. ఇటీవల ఈ సినిమాపై రాజమౌళి ప్రశంసలు కురిపించారు. బెస్ట్ సినిమా అని.. అందరూ తప్పక చూడాలని కోరారు. అలాగే, రజనీకాంత్, శివకార్తికేయన్ ఈ చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

## ఓటీటీకి హిట్–3



నాని హీరోగా శైలేశ్ కొలను దర్శకత్వంలో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ 'హిట్ 3'. మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చిన సినిమా అభిమానులను మెప్పించింది. ఇప్పుడీ చిత్రం ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా మే 29నుంచి స్ట్రీమింగ్ కానుంది. హిట్ ఫ్రాంఛైజీలో భాగంగా వచ్చిన సినిమాలో నాని సరసన శ్రీనిధిశెట్టి నటించగా.. రావు రమేశ్, సూర్య శ్రీనివాస్, అదిల్ పాలా కీలకపాత్రలు పోషించారు.

కథేంటంటే.. అర్జున్ సర్కార్ (నాని) ఐపీఎస్ అధికారి. జమ్మూకశ్మీర్లోని హోమిసైడ్ ఇన్వెస్టిగేటివ్ టీమ్(హిట్)లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో క్రూరమైన ఓ హత్య కేసు వెలుగులోకి వస్తుంది. అది ఎవరు చేశారో పరిశోధిస్తుండగా అచ్చం అదేతరహాలో దేశవ్యాప్తంగా 13 హత్యలు జరిగిన సంగతి వెలుగులోకి వస్తుంది. దీని వెనక ఓ పెద్ద నెట్వర్క్ ఉందని అర్జున్ తెలుసుకుంటాడు. దాన్ని ఛేదించేందుకు బిహార్, గుజరాత్ తదితర ప్రాంతాలకు వెళ్తాడు. ఆకేస్ కొలిక్కి వచ్చేలోపు అర్జున్ విశాఖకి బదిలీ అవుతాడు. అక్కడికి వచ్చాక కూడా ఈ కేస్‌ని ఛేదించేందుకు ఏంచేశాడు? వరుసగా జరుగుతున్న ఈ హత్యల వెనక దాగిన చీకటి కోణాలేమిటి? వాటిని చేయిస్తున్నది ఎవరు? ఆయనకీ, మృదుల (శ్రీనిధి)కీ మధ్య ఉన్న సంబంధం ఏమిటి? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

## థియేటర్ల బంద్ లేదు


జూన్ 1నుంచి తెలుగు రాష్ట్రాల్లో సినిమా థియేటర్ల బంద్ లేదని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రకటించింది. థియేటర్లకు కూడా పర్సంటేజీ విధానం అమలు చేయాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో శనివారం ఫిల్మ్ ఛాంబర్లో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం సమావేశానికి సంబంధించిన వివరాలను ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ వెల్లడించారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. "థియేటర్ల బంద్ అనేది తప్పుగా చిత్రీకరించారు. చర్చలు జరగకపోతే, జూన్ 1నుంచి అలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందన్నది మాత్రమే నిజం. కానీ, అందరూ థియేటర్లు మూసివేస్తారన్న సమాచారాన్నే ప్రచారం చేశారు. ప్రస్తుతం అలాంటిదేమీ లేదు. కేవలం ఒక్క సినిమాను దృష్టిలో పెట్టుకుని థియేటర్లను బంద్ చేస్తున్నామనడం సరికాదు. కొన్ని వార్తలు బిజినెస్‌ను దెబ్బతీస్తాయి. చిత్ర పరిశ్రమలో వంద సమస్యలున్నాయి. అన్నీ ఒకదానితో ఒకటి కనెక్ట్ అయి ఉన్నాయి. వాటిని ఒక్కొక్కటీ పరిష్కరించుకుంటూ రావాలి. థియేటర్ల పర్సంటేజీ విషయమై కొన్నేళ్లుగా ఎలాంటి చర్చ జరగలేదు. ప్రస్తుతం జరుగుతోంది. తర్వాత రోడ్ మ్యాప్ ఏంటనేది నిర్ణయిస్తాం. మూడు సెక్టార్లనుంచి కమిటీ వేస్తున్నాం. నిర్ణీత సమయంలోగా సమస్యలు పరిష్కరించుకుంటాం. ఈనెల 30న జరిగే సమావేశంలో కమిటీ ఎవరనేది నిర్ణయిస్తాం"



"థియేటర్ల బంద్ ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్, దాని ప్రతినిధుల నుంచి వచ్చే సమాచారమే అధీకృతం. దానికి మేము సమాధానాలు చెబుతాం. ఎవరెవరి దగ్గరి నుంచో మీడియా అభిప్రాయాలు తీసుకుని ఎవరి వెర్షన్ వారు రాసుకుని వార్తలు ప్రసారం చేస్తున్నారు.

ఫిల్మ్ ఛాంబర్‌లో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా రాయడం సరి కాదు. చిత్ర పరిశ్రమలో అన్ని వర్గాలను త్వరలోనే కలుస్తాం. వీలైనన్ని సమస్యలను మేమే పరిష్కరించుకుంటాం. మిగిలిన వాటి విషయంలో ప్రభుత్వంతోనూ చర్చిస్తాం. ఏపీ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి ఇండస్ట్రీలోని సమస్యలను వివరిస్తాం" అని ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ అన్నారు.

## కేన్స్ కార్పెట్‌పై ఆలియా



బాలీవుడ్ నటి అలియా భట్ కేన్స్ వేదికపై మెరిశారు. తొలిసారి ఈ వేడుకలకు హాజరైన అలియా.. తన లుక్‌తో అభిమానులను ఆశ్చర్యపరిచారు. సింపుల్ ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన ఫ్లోరల్ గౌన్‌తో నాజూగ్గా కనిపించారు. కేన్స్ రెడ్ కార్పెట్‌పై అరంగేట్రం చేయడానికి ముందు తన లుక్ ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేశారు. 'హలో కేన్స్' అంటూ క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఆ పిక్స్ వైరల్ అవుతున్నాయి. ఈ అంతర్జాతీయ వేదికపై మెరిసిన తారల జాబితాలో అలియా చేరడం ఆనందంగా ఉందంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. మే 13నుంచి 24 వరకూ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. తొలి రోజు అలియా వెళ్తారని అందరూ భావించారు. అయితే భారత్ –పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆమెతన ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. దీంతో అసలు ఆమె హాజరవుతారా? లేదా? అని అనుకున్నారు. ఫ్యాన్సుకు సర్‌ప్రైజ్ ఇస్తూ వేడుక ముగిసే సమయానికి వేదికపై మెరిశారు అలియా.